MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 307 | పేజీలు : 8 | మంగళవారం 27 అక్టోబర్ 2026 | వెల : 6-00

దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యానికి పెద్దపీట

- బ్రిక్స్ దేశాల పార్లమెంటరీ సంబంధాల బలోపేతానికి భారత్ కృషి
- ప్రపంచ సవాళ్ల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే మార్గం
- పార్లమెంటరీ వ్యవస్థలో ఆవిష్కరణలు, సంస్కరణలకు ప్రాధాన్యం
- ప్రజాస్వామ్య సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం అవసరం
- అంతర్జాతీయ సహకారంపై చర్చలకు బ్రిక్స్ ఫోరమ్ వేదిక
- సభ్య, భాగస్వామ్య దేశాల ప్రతినిధుల హాజరు

సభ్య దేశాల ప్రతినిధులతో ప్రధాని మోదీ భేటీ

5



ఎన్టీఆర్ దూరదృష్టితో వైద్య విద్యకు బలమైన పునాది


- ఎన్టీఆర్ యూనివర్సిటీ నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలి
- ప్రాణాంతక వ్యాధులపై పరిశోధనలు ముమ్మరం చేయాలి
- వైద్య విద్య పట్టాలకే పరిమితం కావొద్దు
- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నోబెల్ గ్రహీతలు రావాలి
- వైద్య వృత్తిలో మానవత్వం, కరుణ కీలకం
- 12 ఏళ్లలో వైద్య విద్య గణనీయంగా విస్తరించింది
- ఎంబీబీఎస్ సీట్లు 1.20 లక్షలకు పెరిగాయి
- 40 ఏళ్ల ప్రస్థానంపై స్మారక సంచిక విడుదల చేసింది



అమరావతి, మహానగర్

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ 40 ఏళ్ల వార్షికోత్సవం జరుపుకోవడం ఆనందదాయకమని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. వేడుకలు జరుపుకొంటున్న వర్సిటీ వైస్‌ఛాన్సలర్, విద్యార్థులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ - మిగతా2లో

కష్టపడ్డవారికి గుర్తింపు



అమరావతి, మహానగర్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని, ప్రతిఒక్కరూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. 'చెప్పాం-చేస్తున్నాం' అనే నినాదంతో ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో మిత్రధర్మాన్ని తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 సార్వత్రిక ఎన్నికల్లో అద్భుత విజయం తర్వాత మనం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం. - మిగతా2లో

- స్థానిక ఎన్నికలపై పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- 'చెప్పాం-చేస్తున్నాం' ప్రచారంతో ప్రజల్లోకి వెళ్లాలని నేతలకు ఆదేశం
- మిత్రధర్మాన్ని తప్పకుండా పాటించాలని, ఎలాంటి వెసులుబాటు లేదని స్పష్టీకరణ
- అర్హులైన నేతలకు నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ
- ప్రతి బూత్‌లోనూ 2024 కంటే ఎక్కువ ఓట్లు పడాలని లక్ష్య నిర్దేశం



రక్షణ రంగానికి భారీ బూస్ట్

- రూ.2.12లక్షల కోట్లతో డ్రోన్స్, గన్స్, హెలికాప్టర్స్ కొనుగోలు
- రక్షణ దళాల ఆధునికీకరణకు కేంద్రం ఆమోదం
- సైన్యం కోసం డ్రోన్లు, గన్ సిస్టమ్స్, హెలికాప్టర్ల కొనుగోలు
- సరిహద్దుల్లో నిఘా, వైమానిక దాడుల నిరోధక సామర్థ్యాలకు బలోపేతం
- నౌకాదళం కోసం క్షిపణి నిరోధక వ్యవస్థలు, ఆధునిక పరికరాలు
- వైమానిక దళం కోసం హెలికాప్టర్లు, వాతావరణ రాడార్ల కొనుగోలు

5



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- జ్ఞానేశ్ కుమార్ కోసం మోదీ సర్కార్ అన్ని రకాల ఎత్తుగడలు వేస్తోంది
- జ్ఞానేశ్ కుమార్‌కు రక్షణగా మోదీ సర్కార్ ఎత్తుగడలు: ఖర్గే
- ఓటరు జాబితాలపై పారదర్శకత ఏదీ?

క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ




- రాహుల్‌కు కోర్టులో ఊరట
- తీర్పును స్వాగతించిన కాంగ్రెస్
- గాంధేయ మార్గంలో బీజేపీపై పోరు
- ఫిర్యాదుదారుడి అర్హతపై అభ్యంతరం
- ఎనిమిదేళ్ల కేసుకు ముగింపు
- అమిత్ షాపై వ్యాఖ్యలతో వివాదం
- కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

5

అర్నబ్ తుపానుపై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

- ప్రాణనష్టం జరగకుండా పక్కా కార్యాచరణ చేపట్టాలి
- బాపట్ల--విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- గంటకు 115-125 కి.మీ. వేగంతో గాలులు వీచే ప్రమాదం
- విద్యుత్, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక నిఘా



అమరావతి, మహానగర్

అర్నబ్ తుపానుపై ఆంధ్రప్రదేశ్ సర్కారు హైఅలర్ట్ ప్రకటించింది. క్షణక్షణం తుపాను కదలికలపై నిఘా పెట్టి ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా పక్కా కార్యాచరణతో ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావం, వర్షాలు, గాలులు, వరద ప్రవాహాల తీవ్రతను అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అర్నబ్ తుపాను - మిగతా2లో

ఆ జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు

- అర్నబ్ తుపాను ప్రభావంతో ఏడు జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు
- ఈ నెల 27, 28 తేదీల్లో విద్యా సంస్థలకు సెలవు ప్రకటన
- విశాఖ--బాపట్ల మధ్య తుపాను తీరం దాటే అవకాశం
- తీర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ
- పలు జిల్లాలకు ఆరెంజ్, రాయలసీమకు ఎల్లో అలర్ట్
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరిక
- అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వద్దు



అమరావతి, మహానగర్

రాష్ట్రంలో అర్నబ్ తుపాను ప్రభావిత జిల్లాల్లో విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈనెల 27, 28 తేదీల్లో అధికారులు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించించారు. విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, కాకినాడ, ఎన్టీఆర్, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. మరోవైపు బంగాళాఖాతంలో కొనసాగుతున్న తుపాను కొన్ని గంటల్లో తీవ్ర తుపానుగా మారనుంది. రేపు అతి తీవ్ర తుపానుగా ఆ తర్వాత ప్రచండ తుపానుగా మారుతుందని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆ సమయంలో 200 వందల కిలోమీటర్ల వేగంతో తుపాను కేంద్రం - మిగతా2లో

సర్ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నాం

- ఫారం-6ను సవరించలేదు'.. సుప్రీంకోర్టులో జుజ అఫిడవిట్
- ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్ణయాలన్నీ ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగా తీసుకున్నారు
- ఫారం- 6 ను కూడా సవరించలేదని వివరణ..
- అభిప్రాయాలు, ఆలోచనలన్నీ తుది నిర్ణయాలు కావు!



5

ఎన్టీఆర్ దూరదృష్టితో వైద్య విద్యకు బలమైన పునాది

-మొదటిపేజీ తరువాయి

40 ఏళ్ల ప్రస్థానం పురస్కరించుకుని రూబీ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ వికసిత్ భారత్ దిశగా దూసుకెళ్తున్న సమయంలో అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ అంటే గ్రామస్థాయి వరకూ అభివృద్ధి సాధ్యమైనట్లేనని అన్నారు. ప్రధాని మోదీ హయాంలో విద్యా, వైద్య సంస్థలు చాలావరకు పెరిగాయని వివరించారు. ఎన్డీయే పాలనలో మెడికల్ కళాశాలలు రెట్టింపయ్యాయని ఎంబీబీఎస్ సీట్లు 172 శాతం, పీజీ సీట్లు 177 శాతం పెరిగాయవని వెల్లడించారు. పరిశోధనల్లో మరింత ఉత్సాహం, ప్రతిభ చూపాల్సిన సమయమిదని అన్నారు. సమస్యకు పరిష్కారం చూపగలిగితేనే ఏదైనా సాధ్యమవుతుందని ఉపరాష్ట్రపతి చెప్పారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఏపీలో నాలుగు దశాబ్దాలుగా ఆరోగ్య శాస్త్ర విద్య అభివృద్ధిలో ఎన్టీఆర్ వర్సిటీ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. వైద్య విశ్వవిద్యాలయ స్థాపనలో ఎన్టీఆర్ దూరదృష్టి కీలకమని కొనియాడారు. ఎంతో మంది వైద్యులు, నర్సులు, దంతవైద్యులు , అనుబంధ ఆరోగ్య సంరక్షణ నిపుణులను తయారు చేసిందని చెప్పారు. ఈ అద్భుతమైన ప్రయాణానికి కృషి చేసిన విశ్వవిద్యాలయ నాయకత్వాన్ని అభినందించారు. వైద్య విద్యారంగంలో ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని కొనియాడిన ఉపరాష్ట్రపతి వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా వైద్య విద్య విస్తరణ జరగాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు వైద్యవిద్యతో పాటు అధునాతన పరిశోధనలపై దృష్టి సారించాలని క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు పరిష్కారాలు కనుగొనాలని ఉపరాష్ట్రపతి సూచించారు. పరిశోధనల్లో విద్యార్థుల



అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని కోరారు. వైద్యవృత్తిలో రోగుల పట్ల మానవత్వం, ఆప్యాయత చాలా ముఖ్యమని సూచించారు. డ్రగ్స్ వినియోగం అరికట్టేందుకు వైద్యులు, యువత చొరవ తీసుకోవాలని వాటి దుష్ప్రభావాలపై సమాజంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

"ఉన్నత విద్యను అందరికీ అందించడమే వికసిత్ భారత్ లక్ష్యం. ప్రధాని మోదీ నాయకత్వంలో వైద్య విద్యారంగం గణనీయ విస్తరించింది. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా వైద్య కళాశాలలు భారీగా పెరిగాయి. దేశంలో వైద్య కళాశాలల సంఖ్య రెండింతలకు పైగా పెరిగింది. 21 వేలు ఉన్న ఎంబీబీఎస్ సీట్లు ప్రస్తుతం 1.20 లక్షలకు పెరిగాయి."

పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయం : దేశంలోనే తొలి వైద్య వర్సిటీగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి గుర్తింపు ఉందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. నాలుగు దశాబ్దాలుగా వైద్య విద్య, ప్రజారోగ్య సేవల్లో ఈ వర్సిటీ ప్రత్యేక స్థానం సాధించిందని చెప్పారు. వైద్య విద్యలో ఏఐ, డిజిటల్ అభ్యసనానికి ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. విద్యార్థులకు పుస్తక జ్ఞానంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్‌వర్క్ అవసరమని చెప్పారు. ఎన్టీఆర్ వర్సిటీ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఏపీ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న సీపీ రాధాకృష్ణన్?కు రాష్ట్ర గవర్నర్? అబ్దుల్ నజీర్, సీఎస్? సాయి ప్రసాద్, మంత్రి నారా లోకేశ్?, ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అలానే ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, కలెక్టర్ డీకే బాలాజి, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు.


అర్నబ్ తుపానుపై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

-మొదటిపేజీ తరువాయి

ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, వివిధ శాఖల మంత్రులు వరుస సమీక్షలు చేపట్టి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధతే కీలకమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గతంలో వచ్చిన తుపాన్ల సమాచారాన్ని విశ్లేషించి, ప్రస్తుత పరిస్థితులతో పోల్చుతూ ప్రమాద తీవ్రతను అంచనా వేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని, తీర ప్రాంత ప్రజలను తుపాను షెల్టర్లకు తరలించే ప్రక్రియను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం

తుపాను కదలికలు, తీరం దాటే అంచనాలపై హోంమంత్రి అనిత వివరాలు వెల్లడించారు. అర్ధరాత్రికి తుపాను తీవ్రంగా, రేపటికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఎల్లుండి ఉదయం బాపట్ల–విశాఖ మధ్య తీరం దాటే అవకాశముందని, గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచవచ్చని వివరించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని, అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని స్పష్టం చేశారు. తుపాను కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే పునరుద్ధరణకు వెంటనే చర్యలు చేపట్టాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. అవసరమైన సిబ్బందిని, పరికరాలను సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తే వినియోగదారులకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు.



ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోలపై నిరంతరం పర్యవేక్షణ

సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, నదులు, కాలువల వద్ద నీటి మట్టాలు, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోలను నిరంతరం పర్యవేక్షించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. వరద ముప్పున్న ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని, నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లాలోని బుడమేరు కాలువ, ఏలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో పనులు కొనసాగిస్తూ, 2027 మార్చి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. రహదారులపై చెట్లు కూలినా, రాకపోకలకు అంతరాయం కలిగినా వెంటనే స్పందించేలా యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. ప్రమాదకర వంతెనలు, కల్వర్టుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అవసరాన్ని బట్టి ట్రాఫిక్‌ను నియంత్రించాలని సూచించారు. ఇంజినీరింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, కలెక్టర్లు, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

పంట నష్టాన్ని తగ్గించేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. వాతావరణం అనుకూలించినప్పుడు కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, మినుము, పెసర, కంది పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులపై టార్పాలిన్లు కప్పాలని, పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువలను శుభ్రం చేయాలని ఆదేశించారు. వర్షాలు పడే సమయంలో యూరియా, పైపాటుగా వేసే ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని స్పష్టం చేశారు. ఉద్యాన పంటలకు నష్టం కలగకుండా అరటి, బొప్పాయి మొక్కలకు ఆసరా ఏర్పాటు చేయాలని, పందిరి పంటల నిర్మాణాలను బలోపేతం చేయాలని అచ్చెన్నాయుడు సూచించారు. పశువులు, కోళ్లు ఉండే షెడ్లలోకి నీరు చేరకుండా చూడాలని, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, మోటార్లు, డ్రిప్ పరికరాలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని తెలిపారు. తుపాను తర్వాత పంటలకు తెగుళ్లు, వ్యాధులు సోకకుండా వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

ప్రజల ప్రాణ రక్షణకే తొలి ప్రాధాన్యం

తుపాను వేళ ప్రజలు విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలు, చెట్లు, హోర్డింగులు, బలహీనమైన భవనాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించేవారు అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా ఉండటంతో పాటు ఇప్పటికే సముద్రంలో ఉన్న బోట్లు సురక్షిత తీరానికి చేరుకోవాలని హెచ్చరించారు. తుపాను అనంతరం పంటలు, పశువులు, వ్యవసాయ పరికరాలకు జరిగిన నష్టాన్ని నమోదు చేసి సంబంధిత అధికారులకు తెలియజేయాలని, బీమా క్లెయిమ్‌లకు అవసరమైన ఆధారాలను భద్రపరచుకోవాలని సూచించారు. తాగునీటిని కాచి చల్లార్చి తీసుకోవాలని, అన్ని వేళలా ప్రాణ రక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

విశాఖ తూర్పు తీరాన్ని శాన్‌ఫ్రాన్సిస్కోగా తీర్చిదిద్దుతాం

ప్రకృతి అందాలు, టెక్నాలజీ హంగులు ఈ రెండింటి కలయికతో విశాఖను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. గంగవరం బీచ్ అందాలను పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ప్రపంచానికి పరిచయం చేయగా, విశాఖ ప్రత్యేకతను చాటినందుకు ఆయనకు మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కొండలు సముద్రాన్ని తాకే తీరం, ఎత్తైన రాతి కొండచరియలు, వేగంగా విస్తరిస్తున్న టెక్నాలజీ రంగం ఇవే విశాఖ అసలైన బలాలని వివరించారు. ప్రకృతి సౌందర్యాన్ని దెబ్బతీయకుండా ప్రపంచ స్థాయి సాంకేతిక పరిశ్రమలు అభివృద్ధి చెందేలా నగరాన్ని తీర్చిదిద్దాలన్నదే తమ విజన్ అని లోకేశ్ తెలిపారు. తూర్పు తీరానికి శాన్‌ఫ్రాన్సిస్కోగా విశాఖను నిలబెడతామన్నారు. ప్రకృతి, ప్రగతి కలిసి నడిచే నగరంగా విశాఖను తీర్చిదిద్దుతామని లోకేశ్ వెల్లడించారు. గంగవరం బీచ్‌పై ఆనంద్ మహీంద్రా చేసిన పోస్టుకు మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు.

గంగవరం బీచ్‌పై ఆనంద్ మహీంద్రా ఆసక్తికర పోస్టు : విశాఖపట్నం సమీపంలోని గంగవరం బీచ్ సుందర దృశ్యాలకు ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ఫిదా అయ్యారు. దీంతో గంగవరం బీచ్ గురించి



ఆనంద్ మహీంద్రా 'ఎక్స్'లో ఆసక్తికర పోస్టు చేశారు. దేశంలో ఎక్కువ మంది మాట్లాడుకునే తీరప్రాంత ప్రదేశాల్లో గంగవరం బీచ్ ఎందుకు లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఇది మనకు తెలిసిన కొబ్బరి చెట్లు, పచ్చదనం దృశ్యాలు కనిపించే సాధారణ బీచ్ లాంటిది కాదు. ఎత్తయిన రాతి కొండలతో కఠినమైన, ఒకవిధమైన పురాతన అందం ఇక్కడ కనిపిస్తోంది. ఇలాంటి సహజ సౌందర్యమే నన్ను ఎక్కువగా ఆకర్షిస్తుంది. ఇక్కడ సేద తీరడమే కాకుండా, ప్రశాంతంగా కాసేపు ఆత్మపరిశీలన కూడా చేసుకోవచ్చు.

ప్రస్తుతం ప్రపంచంలోని టెక్ దిగ్గజాలు. భారీ డేటా సెంటర్లు, ఏఐ మౌలిక సదుపాయాల నిర్మాణానికి వైజాగ్‌కు వస్తున్నాయి. కానీ, ఇక్కడి దృశ్యాలను చూస్తుంటే లక్షల ఏళ్ల క్రితమే ప్రకృతి పెద్దఎత్తున విస్తరణ ప్రక్రియను మొదలుపెట్టినట్లు అనిపిస్తోంది. విశాఖపట్నం ప్రధాన టెక్ హబ్‌గా వేగంగా మారుతోంది. అదేవిధంగా అత్యంత అద్భుతమైన తీరప్రాంత పర్యాటక ప్రదేశంగానూ వెలుగొందే సత్తా దీనికి ఉందని భావిస్తున్నా" అని ఆనంద్ మహీంద్రా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. నెటిజన్లు ఆయన వ్యాఖ్యలతో ఏకీభవించారు.

రిటైర్మెంట్ అనంతరం జీవితాంతం ఆదాయం అందించే ఐసీఐసీఐ లైఫ్ కొత్త పెన్షన్ ప్లాన్

ICICI Life INSURANCE

విజయవాడ, మహానగర్:

పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రతతో పాటు ఆదాయ వృద్ధికి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ 'ఐసీఐసీఐ లైఫ్ గ్యారంటీడ్ ఇండెక్స్‌డ్ పెన్షన్' పేరుతో కొత్త పథకాన్ని ఆవిష్కరించింది. గ్యారంటీడ్ యాన్యుటీ, వేరియబుల్ యాన్యుటీ ప్రయోజనాలను కలిపి అందించే ఈ పథకం ద్వారా జీవితాంతం నిర్దిష్ట ఆదాయాన్ని పొందడంతో పాటు నిఫ్టీ 50 టోటల్ రిటర్న్ ఇండెక్స్‌తో అనుసంధానమైన ఆదాయ వృద్ధి అవకాశాలను వినియోగించుకోవచ్చు. ఇందులో కచ్చితమైన ఆదాయ భాగాన్ని 60 నుంచి 100 శాతం వరకు ఎంచుకునే వెసులుబాటు ఉంది. మిగిలిన మొత్తాన్ని సూచీ ఆధారిత ఆదాయానికి అనుసంధానించవచ్చు. సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్, రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైజ్ ఆప్షన్లతో ఈ పథకం అందుబాటులో ఉంటుంది. నెలవారీ, త్రైమాసిక, ఆరు నెలలకోసారి లేదా ఏడాదికోసారి ఆదాయం పొందే సౌకర్యం కల్పించారు. యాన్యుటీ అడ్వాన్స్ ఫీచర్ ద్వారా తదుపరి ఐదేళ్ల గ్యారంటీడ్ యాన్యుటీలో 99 శాతం వరకు ముందుగానే పొందే అవకాశం ఉంది. ఆరోగ్య నిర్వహణ, వెల్‌నెస్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని ఐసీఐసీఐ లైఫ్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ వికాస్ గుప్తా తెలిపారు. దీర్ఘకాలిక ఆర్థిక అవసరాలకు అనుగుణంగా రిటైర్మెంట్ ప్రణాళికలు రూపొందించుకోవడానికి ఈ పథకం ఉపయోగపడుతుందని కంపెనీ పేర్కొంది.

కష్టపడ్డవారికి గుర్తింపు

-మొదటిపేజీ తరువాయి

151 సీట్లతో గెలిచి అరాచకాలు సృష్టించిన గొడ్డలి పార్టీని ప్రజలు కేవలం 11 సీట్లకే పరిమితం చేసి తిరుగుబాటు చేశారు. ఇప్పుడు మనం అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాం. ప్రభుత్వ సేవలను సులభతరం చేస్తూ సుపరిపాలన అందిస్తున్నాం. ఈ మంచి పనులను ప్రజలకు వివరించాలి" అని అన్నారు.

మిత్రధర్మం పాటించాల్సిందే..

కూటమి పార్టీల మధ్య క్షేత్రస్థాయిలో చక్కటి సమన్వయం ఉండాలని చంద్రబాబు గట్టిగా సూచించారు. "కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా నిలవాలి. మిత్రధర్మాన్ని పాటించడంలో ఎలాంటి వెసులుబాటు ఉండదు. మూడు స్థాయిల్లోనూ (కేంద్ర, రాష్ట్ర, స్థానిక) ఒకే ప్రభుత్వం ఉంటే జరిగే అభివృద్ధిని ప్రజలకు వివరించాలి. వార్డు, డివిజన్ మొదలు ప్రతి స్థానంలోనూ కూటమి జెండాలు ఎగరాలి" అని ఆయన స్పష్టం చేశారు. పొత్తులు, రిజర్వేషన్లు, సామాజిక సమీకరణాల కారణంగా కొంతమంది నేతలకు స్థానిక ఎన్నికల్లో అవకాశాలు దక్కకపోవచ్చని చంద్రబాబు అంగీకరించారు. "పార్టీ కోసం, రాష్ట్రం కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుంది. అలాంటి వారికి నామినేటెడ్ పదవులతో గౌరవిస్తాం. పాలనలో తాము కూడా భాగస్వాములమనే సంతృప్తి ప్రతి వర్గానికి కలగాలి. అందుకే బీసీలకు, చిన్న కులాలకు కూడా ఈ ఎన్నికల్లో ప్రాధాన్యత ఇచ్చాం" అని భరోసా ఇచ్చారు. అగ్ర నేతల నుంచి కార్యకర్తల వరకు అందరి పనితీరును రికార్డ్ చేస్తున్నామని తెలిపారు.

గొడ్డలి పార్టీపై ప్రజలను అప్రమత్తం చేయాలి

ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిస్తూనే, ప్రతిపక్షం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "గొడ్డలి పార్టీ వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించాలి. ఆ పార్టీ అధ్యక్షుడు తన స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఎలా తాకట్టు పెడతాడో, కుటుంబ బంధాలను కూడా ఎలా పట్టించుకోడో ప్రజలకు తెలియజేయాలి. ప్రతి ఓటరు పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసేలా చూడాలి. 2024 ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు ప్రతి బూత్‌లోనూ పడాలి" అని ఆయన లక్ష్య నిర్దేశం చేశారు.

ఏపీలో అర్నబ్ తుపాను ఎఫెక్ట్
ఆ జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు



-మొదటిపేజీ తరువాయి

వద్ద గాలి నిక్షిప్తమై ఉంటుందని తెలిపింది. ఎల్లుండి మధ్యాహ్నం అతి తీవ్ర తుపానుగా విశాఖ – బాపట్ల మధ్య తీరం దాటే అవకాశం ఉందని స్పష్టం చేసింది. తీరం దాటే సమయంలో 135 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది.

రేపు, ఎల్లుండి అత్యంత భారీ వర్షాలు

మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేసింది. అర్నబ్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలో రేపు, ఎల్లుండి అత్యంత భారీ, అతి భారీ, భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. కాకినాడ, కోనసీమ, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించింది. ఈ జిల్లాల్లో రేపు అత్యంత భారీ వర్షాలు దాదాపు 20 సెంటీమీటర్ల మించి వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, గుంటూరు, ప్రకాశం , బాపట్ల, నెల్లూరు జిల్లాలో ఆరంజ్ అలెర్ట్ ప్రకటించారు. 20 సెంటీ మీటర్ల లోపు వర్షపాతం నమోదయ్యే అవకాశముందన్నారు. రాయలసీమ జిల్లాల్లో ఎల్లో అలెర్ట్ ప్రకటించారు. అక్కడా చెదురుమదురు జల్లులు పడతాయని వెల్లడించారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ

అర్నబ్ తుపాను తీవ్రరూపం దాల్చుతున్నందున రాష్ట్ర యంత్రాంగాన్ని హోంమంత్రి అనిత అప్రమత్తం చేశారు. తుపాను గమనాన్ని అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వాతావరణం ప్రశాంతంగా ఉందనే భావనతో అలసత్వం వహించవద్దని ప్రజలకు సూచించారు. రేపు, ఎల్లుండి అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత జిల్లాలకు ఇప్పటికే ఎన్డీఆర్?ఎఫ్?, ఎడీఆర్?ఎఫ్? బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. రాబోయే 3 నుంచి 5 రోజుల పాటు తీర ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మకుండా ఏపీఎస్?డీఎంఏ, ఆర్టీజీఎస్? విడుదల చేసే అధికారిక సమాచారాన్నే అనుసరించాలని మంత్రి అనిత విజ్ఞప్తి చేశారు.

తొలి రోజే ఆంధ్ర ఆలౌట్





విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

మూలపాడు వేదికగా ఆంధ్ర, ఛత్తీస్‌ఘర్ జట్ల మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్ తొలి రోజు ఆటలో బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర జట్టు 73.2 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌట్ అయింది. ఆంధ్ర బ్యాటర్ ఎస్.వి. రాహుల్ 173 బంతులను ఎదుర్కొని ఏడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 89 పరుగులు సాధించి జట్టు తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఛత్తీస్‌ఘర్ బౌలర్లలో జయంత్ యాదవ్ నాలుగు వికెట్లు, అజయ్ మండల్ మూడు వికెట్లు, ధర్మేంద్ర సింగ్ జడేజా రెండు వికెట్లు పడగొట్టి ఆంధ్ర బ్యాటర్లను కట్టడి చేశారు. టీ విరామం అనంతరం ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్ ముగిసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఛత్తీస్‌ఘర్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 35 పరుగులు చేసింది. తొలి రోజు ఆటలో ఎస్.వి. రాహుల్ పోరాటం ఆంధ్రకు కీలకంగా నిలవగా, ఛత్తీస్‌ఘర్ బౌలర్లు సమష్టిగా రాణించారు. రెండో రోజు ఆంధ్ర బౌలర్లు ప్రత్యర్థి జట్టును కట్టడి చేసేందుకు చేసే ప్రయత్నాలపై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎంపీ కేశినేని చిన్ని ప్రచారం

86, 85, 84, 83, 82, 78వ డివిజన్లలో రోడ్‌షో

అడుగడుగునా మహిళల ఘన స్వాగతం



విజయవాడ, మహానగర్

సెంట్రల్ నియోజకవర్గంలోని 86, 85, 84, 83, 82, 78వ డివిజన్లలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ, సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుతో కలిసి సోమవారం నిర్వహించిన రోడ్‌షోకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దారిపొడవునా మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పెన్షన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాలతో పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. విజయవాడ వంటి నగర ప్రాంతాల్లోనూ పేదలకు ఇళ్ల పట్టాలు అందించే కార్యక్రమాలను చేపట్టడం ప్రభుత్వ ప్రజా సంక్షేమ దృక్పథానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తారని పేర్కొన్నారు. విజయవాడ నగర అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణతో పాటు సెంట్రల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పోటీ చేస్తున్న కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎంపీ కేశినేని చిన్ని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

7వ డివిజన్‌లో జనసేన అభ్యర్థి పద్మశ్రీ హవా!



మచిలీపట్నం, మహానగర్

మున్సిపల్ ఎన్నికల్లో 7వ డివిజన్ నుంచి కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న చదలవాడ పద్మశ్రీ ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గాజు గ్లాసు గుర్తుపై పోటీ చేస్తున్న ఆమెకు డివిజన్ ప్రజల నుంచి స్పందన లభిస్తోందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ, తనకు అవకాశం కల్పిస్తే 7వ డివిజన్ రూపురేఖలు మార్చి అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్పొరేటర్‌గా గెలిపిస్తే డివిజన్‌లో డ్రైనేజీ, రహదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించడం, వీధి దీపాలు ఏర్పాటు చేయడం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం వంటి పనులకు ప్రాధాన్యమిస్తానని హామీ ఇచ్చారు. మహిళలు, యువతకు కూటమి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి దార్శనికతకు అనుగుణంగా 7వ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. డివిజన్ ప్రజలు తనను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమాల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. 7వ డివిజన్‌లో పద్మశ్రీ విజయం సాధిస్తారని కూటమి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

29వ వార్డులో మంత్రి సతీమణి కమలాలక్ష్మి ప్రచారం

నూజివీడు, మహానగర్



మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ మంత్రి కొలుసు పార్థసారథి సతీమణి కొలుసు కమలాలక్ష్మి సోమవారం స్థానిక 29వ వార్డులో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులతో కలిసి వార్డులో పర్యటిస్తూ స్థానికులను ఆప్యాయంగా పలకరించి, వారి వ్యక్తిగత, వార్డు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు, కూటమి నాయకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. రాష్ట్ర, మున్సిపాలిటీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం కమలాలక్ష్మి మాట్లాడుతూ, స్వర్గీయ నందమూరి తారక రామారావు డ్వాక్రా సంఘాలను ప్రవేశపెట్టి మహిళల సాధికారతకు, ఆర్థిక బలోపేతానికి విశేష కృషి చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలను మరింత అభివృద్ధి చేసి, అధిక మొత్తంలో రుణాలు అందించడం ద్వారా మహిళలను విజయవంతమైన వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతున్నాయని అన్నారు. నూజివీడులో తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పార్కులు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి అధికారిక అభ్యర్థులు, స్థానిక నాయకులు, వార్డు నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పకడ్బందీగా స్థానిక ఎన్నికల ప్రక్రియ

- **జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**
- **జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీటీసీ నామినేషన్ల స్క్రూటినీ పరిశీలన**
- **మాంటిస్సోరి కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఆకస్మిక తనిఖీ**



విజయవాడ, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జరుగుతున్న జడ్పీటీసీ సభ్యుల నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియతో పాటు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతున్న జడ్పీటీసీ నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్క్రూటినీ కొనసాగుతున్న తీరును, అభ్యర్థులు దాఖలు చేసిన పత్రాల పరిశీలన విధానాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.సుశీలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని, అర్హతలు, ధ్రువపత్రాల పరిశీలనలో ఏ విధమైన అలసత్వానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. అనంతరం, విజయవాడ రూరల్ మండలానికి సంబంధించి నగరంలోని మాంటిస్సోరి కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు మరియు నిరంతర సీసీటీవీ నిఘా ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ రోజున సిబ్బందికి, అభ్యర్థులకు, ఏజెంట్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నిరంతరాయ పవర్ సప్లై/జనరేటర్లు, సరైన లైటింగ్, వెంటిలేషన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధం చేయాలి. ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం కౌంటింగ్ టేబుళ్లు, బారికేడ్ల ఏర్పాటు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంలో జిల్లా పరిషత్ సీఈఓ పి.సుశీల, విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, జిల్లా పరిషత్ మరియు రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్నబ్ తుఫాన్ దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఆర్నబ్' తుఫాన్ తీవ్ర తుఫానుగా మారి ఈ నెల 28న బాపట్ల – విశాఖపట్నం మధ్య యానాం వద్ద తీరం దాటే అవకాశం ఉన్నందున ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తమైందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించి, జిల్లా ప్రజలకు పలు కీలక ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. తీవ్ర ఈదురు గాలులు, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు రోడ్డు ప్రయాణాలు మానుకుని ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలన్నారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదకర ప్రాంతాలు, ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిరావాలన్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, రోగులను ముందస్తుగానే ఆసుపత్రులకు తరలించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పడవలు, టూరిస్ట్ బోట్ల రాకపోకలు, గేమ్ పార్కులను పూర్తిగా నిలిపివేయాలన్నారు. చెట్లు, శిథిలావస్థ భవనాలు, తాత్కాలిక షెడ్ల కింద ఆశ్రయం పొందవద్దని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి గానీ, ఉధృతంగా ప్రవహించే కాలువలు, చెరువుల వద్దకు గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లరాదని హెచ్చరించారు. మూగజీవాలను సురక్షిత పాకల్లో ఉంచాలని, చెట్లకు, స్తంభాలకు కట్టేయరాదన్నారు. కోసిన ధాన్యాన్ని రైతులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని సూచించారు. తీవ్ర తుఫాన్ దృష్ట్యా అక్టోబర్ 27, 28 తేదీలలో అంగన్వాడీలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆదేశాలను తప్పక విద్యాసంస్థలు పాటించాలని ఆదేశించారు. విద్యాసంస్థలకు ఇచ్చే సెలవుల్లో పిల్లలను పూర్తిగా ఇళ్లలోనే ఉంచాలని, విహారయాత్రలకు వెళ్లరాదు. తుఫాన్‌పై సోషల్ మీడియాలో వదంతులు, అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తుఫాన్ సంబంధిత సమాచారం మరియు సహాయక చర్యల కోసం కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్‌లో నంబర్ 9154970454ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేత

ఆగిరిపల్లి, మహానగర్



మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న 18 మంది ఎంపీటీసీ అభ్యర్థులకు నూజివీడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎం.వి. ప్రతాప్ అప్పారావు బీ-ఫారాలను అందజేశారు. తోటపల్లి గ్రామంలో బెజవాడ రాంబాబు నివాసంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులను ఉద్దేశించి ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ, అభ్యర్థులందరూ అధిక మెజారిటీతో విజయం సాధించి ఆగిరిపల్లి మండల ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అభ్యర్థులకు, పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు.

మహానగర్

సోనియాగాంధీ బయోగ్రఫీ వివాదాలు

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు.. రాజ్యసభ సభ్యురాలు సోనియాగాంధీ తన సుదీర్ఘ రాజకీయ చరిత్ర.. జీవిత ప్రయాణంలో అనుభవాలను ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో ఆమె ఒక ఆత్మ కథ కూడా రాశారు. దానికి బిలాంగింగ్ జర్నీ ఆఫ్ లవ్ పేరు పెట్టారు. ఈ పుస్తకాన్ని వచ్చేనెల 10వ తేదీన విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో సోనియాగాంధీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ చేశారు.కేం బ్రిడ్జిలోని ఒక చిన్న గ్రీక్ రెస్టారెంట్లో సోనియాగాంధీ, రాజీవ్ గాంధీకి మధ్య ప్రేమ ప్రయాణం మొదలైంది. నాడు వారిద్దరు అక్కడ తరచుగా కలుసుకునేవారు. ఎన్నో తీపి జ్ఞాపకాలు.. ఎన్నో మధురమైన స్మృతులు.. నవ్వులు.. కలిసి ఆరగించిన పదార్థాలు.. వీటికి సంబంధించిన పూర్తి వివరాలను సోనియా గాంధీ తన ఆత్మకథలో ప్రస్తావించారు. ఒక ఉద్యోగ భరితమైన వీడియోను.. అప్పటి ఫోటోలను సోనియా బయట పెట్టారు.ఈ పుస్తకాన్ని దాదాపు 554 పేజీలతో రూపొందించారు సోనియాగాంధీ.. మనదేశంలో హార్పర్ కాలిన్స్ ఇండియా.. ఇంటర్నేషనల్ లెవెల్ లో ప్రఖ్యాతల్ప్పుడ ఎ. నాఫ్ పబ్లిక్ సంస్థలు ఈ పుస్తకాన్ని ప్రచురించాయి. సెకండ్ వరల్డ్ వార్ తర్వాత ఇటలీలో సోనియాగాంధీ బాల్యం మొదలైంది. 1965 లో కేంద్రంలో విద్యార్థిగా ఆమె చేరినప్పుడు రాజీవ్ గాంధీతో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమకు దారితీసింది. అనంతరం వారిద్దరు తమ బంధాన్ని పెళ్లితో మరింత పదిలం చేసుకున్నారు. రాజీవ్ గాంధీతో ఉన్న స్మృతులను.. జ్ఞాపకాలను ఎంతో భావోద్వేగమైన విధానంలో సోనియాగాంధీ ఈ పుస్తకంలో పొందుపరిచారు.. ముఖ్యంగా భారతీయ సంస్కృతికి ఎటువంటి సంబంధం లేకుండా.. ఒక విదేశీ యువతీ దేశంలో అడుగుపెట్టడం.. నెహ్రూ.. గాంధీ కుటుంబాలలో కోడలిగా.. ముఖ్యమైన వ్యక్తిగా ఇమిడిపోవడం వంటి విషయాలను ఆమె అక్షరీకరణ చేశారు.కేవలం తమ ప్రేమకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే ఇందులో సోనియాగాంధీ ప్రస్తావించలేదు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో నెహ్రూ కుటుంబం పడిన ఇబ్బందులు.. గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు.. దేశ రాజకీయాలలో ఈ రెండు కుటుంబాలు పోషించిన పాత్ర వంటి వాటిపై ఈ పుస్తకంలో సోనియాగాంధీ వివరించారు. 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురి కావడం.. 1991లో రాజీవ్ గాంధీ దుర్మరణం చెందడం వంటి దారుణాలు జరిగినప్పుడు తాను ఎదుర్కొన్న విషాదం.. అనుభవించిన మానసిక వేదనను సోనియాగాంధీ ఈ పుస్తకంలో ప్రస్తావించారు. తన కళ్ళ ముందు రక్త సంబంధాలు విచ్చిన్నం కావడం.. పిల్లలు రాహుల్.. ప్రియాంకను చూసుకుంటూ.. ఒంటరిగా ఆమె సాగించిన రాజకీయ ప్రయాణాన్ని ఇందులో ప్రస్తావించినట్టు తెలుస్తోంది.సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీకి అత్యధిక కాలం అధ్యక్షురాలిగా పని చేశారు. 1990 చివరి కాలంలో రాజకీయాల్లోకి సోనియా గాంధీ బలవంతంగా వచ్చారు. ముఖ్యంగా 2004లో యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు.. ప్రధానమంత్రి పదవిని చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ.. దానిని తిరస్కరించిన విధానం.. మన్మోహన్ సింగ్ ఎంపిక.. రెండు పర్యాయాలు కేంద్రంలోకి అధికారంలోకి రావడం.. కీలకమైన సమాచార హక్కు చట్టం.. ఉపాధి వంటి పథకాలను అమలు చేయడం మట్టి విషయాలను సోనియాగాంధీ ఇందులో ప్రస్తావించారు.ఇక ఈ పుస్తకం ప్రచురణకు ముందు పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ తో వచ్చిన వివాదాలు.. మధ్యలోకి హార్పర్ కాలిన్స్ సంస్థ రావడం.. వంటి పరిణామాలు ఈ పుస్తకానికి మరింత ప్రచారం తీసుకొచ్చాయి..సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్.. ఏ జర్నీ ఆఫ్ లవ్' నవంబర్ 10వ తేదీన విడుదల కానుంది.. అయితే బుక్ రిలీజ్ అయిన తర్వాత దేశ రాజకీయాలలో ఎటువంటి మార్పులు చోటు చేసుకోబోతాయో చూడాల్సి ఉంది.ఇంతలోనే వారందరికీ షాక్ ఇస్తూ భారత్‌లో తాము ఆ గ్రంథాన్ని ప్రచురించటం లేదని 'పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా' సంస్థ శుక్రవారం ప్రకటించింది. పుస్తకంలో కొన్నిచోట్ల తాము సూచించిన మార్పులు చేసేందుకు రచయిత (సోనియాగాంధీ) అంగీకరించలేదని, అందువల్లే భారత్‌లో ఆ గ్రంథం ప్రచురణ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు వెల్లడించింది. 'గ్రంథంలోని అంశాల వాస్తవికతను పరిశీలించి రచయితకు పలు సూచనలు ఇవ్వటం పబ్లిషర్‌గా మా బాధ్యత. ప్రచురణ ప్రక్రియలో ఇది సాధారణ అంశం' అని పేర్కొందిపెంగ్విన్ సంస్థ ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ భగ్గుమంది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, భావప్రకటనా స్వేచ్ఛను ఆ సంస్థ చంపేసిందని కాంగ్రెస్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ మండిపడ్డారు. 'సోనియాగాంధీ ఆత్మకథ గ్రంథాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచురించేందుకు పెంగ్విన్ రాండమ్ కంపెనీ సిద్ధంగా ఉంది. కానీ, భారత్‌లో దాని అనుబంధ సంస్థ అయిన పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా మాత్రం ఆ గ్రంథంలో మార్పులు చేయాలని కోరుతోంది. అందుకు కారణమేంటి? ఆ సంస్థ ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గింది? త్యాగం, నిబద్ధతకు సోనియాగాంధీ జీవితం ఉదాహరణ. దేశానికి ఆమె అసాధారణ సేవ చేశారు. అలాంటి గొప్ప నాయకురాలి ఆత్మకథను రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ప్రచురించకుండా తప్పుకోవటం భావప్రకటనా స్వేచ్ఛను హత్యచేయటమే. నరేంద్రమోదీ పాలనలో భారత భూభాగాన్ని చైనా ఆక్రమించటం, మోదీ పాలన, ఆరెస్సెస్ కు సంబంధించి ఎడిటోరియల్‌లోని అంశాలను తొలగించాలని పెంగ్విన్ ఇండియా కోరింది. ఆ అంశాలను తొలగించేలా చూడాలని మోదీ ప్రభుత్వం పబ్లిషర్‌పై ఒత్తిడి తెచ్చిందా?' అని గెహ్లోత్ ప్రశ్నించారు. పెంగ్విన్ సంస్థ నిర్ణయం ఆందోళనకరమని మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ అన్నారు. ఆరెస్సె?సపై గ్రంథాలు ప్రచురించిన పెంగ్విన్ సంస్థ.. సోనియా ఆత్మకథ ప్రచురణ నుంచి తప్పుకోవటానికి చూపిన కారణం బలంగా లేదని లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ విమర్శించారు. కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. సోనియాగాంధీ తన జ్ఞాపకాలు, అనుభవాలను పుస్తక రూపంలో తెస్తున్నప్పుడు.. వాటిలో కొన్ని కల్పనలు కూడా ఉండవచ్చు కదా? అని బీజేపీ నేత అమిత్ మాలవీయ ప్రశ్నించారు. వాటిని సరిచూసుకోవాలని పబ్లిషర్ చెప్పటంలో తప్పేముందని నిలదీశారు.

ఎన్నికల ఘర్షణల్లో బహుజనులే బలి!



'సమర సింహారెడ్డి గారు... చల్లం గుండాలి, మీరు హాయిగ ఉండాలి. భరత సింహారెడ్డి గారు... మీరు బాంబులివ్వాలి. మేము బాంబు లేయాలి. మీ చేతిలోని కత్తులం. మీ కాలి కింది చెప్పులం. మీరు ఉస్కో, ఉస్కో, ఉస్కో అంటే ఉరికే వేట కుక్కలం'. ఇది ప్రముఖ కవి, రచయిత గోరేటి వెంకన్న మూడు దశాబ్దాల క్రితం రాయలసీమ ఫ్యాక్షన్ ముఖచిత్రంపై రాసిన పాట. పాట సారాంశం అంతా కరుడుగట్టిన వర్గ రాజకీయాల కోసం, ఆధిపత్య కులాల బలాబలాల బరిలో తెగిపడ్డ తలల గూర్చి, కరిగిపోయిన నల్ల పూసల పుస్తెల గురించే. రాయలసీమ ఫ్యాక్షనిజానికి సామాజిక, ఆర్థిక, చారిత్రక, రాజకీయ కారణాలు చాలా ఉన్నాయి అని చరిత్రకారులు విశ్లేషిస్తారు. ఫ్యాక్షనిజాన్ని.. పాలెగాళ్ల వ్యవస్థకు ప్రతిరూపంగా వర్ణిస్తారు.

తొలుత విజయనగర రాజులే పన్నుల వసూళ్లు, శాంతిభద్రతలను కాపాడేందుకు పాలెగాళ్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. రాజు చెప్పిన పని చేయటమే వారి విధి. దీంతో పాటు నీటి లభ్యత లేకపోవడం, కరవు పరిస్థితులు, నిరక్షరాస్యత, ఉపాధి లేకపోవడం వంటివి కూడా ఫ్యాక్షన్ పుట్టుకకు కారణాలు. తరువాత బ్రిటిష్ వారి పరిపాలన కాలంలో పాలెగాళ్లు సొంత సైన్యం కలిగివుండి, అధికారం చెలాయించేవాళ్లు. కొందరు బ్రిటిష్ ప్రభుత్వానికి దాసోహం కాగా, ఇంకొందరు స్వాతంత్ర్యం కోసం ఎదురు తిరిగారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డిది ఎదురొడ్డిన చరిత్రే. అలాంటి పాలెగాళ్ల సంస్కృతే తరువాత రాజకీయ రూపం ధరించింది. ఏళ్ళు గడిచినా, ఇప్పటికీ రాయలసీమ ముఖచిత్రంలో ఫ్యాక్షనిజం పూర్తిగా పోలేదు. దాని నకళ్ళు, అడుగుజాడలు కొన్ని ప్రాంతాల్లో జడలు విప్పుతూనే ఉన్నాయి. అయితే నాటి పెత్తందారులు వ్యక్తిగత కక్షలు, గ్రామాల్లో ఆధిపత్యాలు, పంతాల కోసం బడుగులను, బలహీనులను చేరదీసి, పెంచి పోషించేవారు. కర్రలు, కత్తులు, బాంబులు ఇచ్చి తిప్పేవారు. ప్రత్యర్థులపై ప్రతీకారానికి కాలు దువ్వి పంపేవారు. 1970--80 లలో కూడా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఫ్యాక్షన్ వ్యతిరేక ఉద్యమాలు జరిగేవి. పోరాట కమిటీలు పెట్టేవారు. అయితే మారుతున్న ఆధునిక సమాజంలో విద్య, ఉపాధి అవకాశాలు, టెక్నాలజీ, పారిశ్రామికీకరణ నేపథ్యంలో నాటి ఫ్యాక్షన్ కక్షలు చాలా మేరకు తగ్గాయి. చట్టాలు, పోలీసు వ్యవస్థ బలోపేతం కూడా ఈ కక్షలు తగ్గేందుకు తోడ్పడ్డాయి. ఇప్పటికీ కొందరు రాజకీయ నాయకులు ప్రజాస్వామ్య ముసుగులో అదే ఫ్యాక్షన్ పాత్రను పోషిస్తున్నారు. అవసరాల కోసం, రాజకీయ ప్రత్యర్థులపై ప్రతీకారం కోసం, ఎన్నికల్లో అల్లర్లు, హింస కోసం అనుచరులను వాడుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలలో జరుగుతున్న అల్లర్లు, ఉద్రిక్తతలు చూస్తుంటే, పెత్తందారీ వర్గం పట్టు కనిపిస్తోంది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలో కడిమెట్ల, ఎర్రకోట, రాళ్ళదొడ్డి, సిరాలదొడ్డి, గువ్వల దొడ్డి గ్రామాలలో నాలుగు దశాబ్దాలుగా సంస్థాగత ఎన్నికలన్నీ ఏకగ్రీవాలే. ఎలాంటి పోటీ ఉండదు. అంటే ఆ ప్రాంత రాజకీయ పెత్తందారీ కనుసన్నలలోనే ఎన్నికల బొంగరం తిరుగుతుందని అర్థం. తాజాగా పుంగనూరు, రాయచోటి, పులివెందుల, దాచేపల్లి వంటి ప్రాంతాల్లో జరిగిన సంఘటనలు ఈ కోవలోకే వస్తాయి. అయితే ఈ ఘర్షణల్లో బలిపశువులు మాత్రం బహుజనులే. కింది కులాల అమాయకత్వం, నిరక్షరాస్యత, ఆర్థిక అవసరాలు వంటి ఎన్నో బలహీనతలను ఆసరా చేసుకుని ఇలాంటి దుందుడుకు చర్యలు జరుగుతుంటాయి. కానీ ఇప్పుడు చట్టాలు, పోలీసు వ్యవస్థ ప్రేక్షకపాత్ర పోషించేందుకు సిద్ధంగా లేదు. చట్టానికి చేతులు బారు అన్నట్లు నేరాలకు పాల్పడినవారు మూల్యం చెల్లించక తప్పదు. ఈ సందర్భంగా ఘర్షణ వైఖరిలో లభించే ప్రతిఫలానికి ఒక్కటే కొండ గుర్తు. ఏ సంఘటనలోనైనా పెద్ద తలలకు దెబ్బలు తగలవు. అనుచరులకే దెబ్బలన్నీ. ఎద్దుల కుమ్ములాటల్లో లేగదూడ కాళ్ళు విరిగినట్లు... కాళ్ళు విరిగినా, చేతులు విరిగినా పల్లకీ మోసే బోయిలవి మాత్రమే. కాబట్టి బహుజనులు అప్రమత్తంగా ఉండాలి. నాయకుని ప్రేమించటం అంటే కుటుంబ సభ్యులను జైళ్లకు పంపటం కాదని తెలుసుకోవాలి. ఇది ఎన్నికల ప్రక్రియకు మాత్రమే వర్తించదు. అడుగడుగునా జీవిత సమరంలో బహుజనులు బహుపరాక్‌గా ఉండక తప్పదు.

స్థలకాల సందిగ్ధంలో..

స్థలకాలాలను మనిషి శాసిస్తాడా లేక స్థలకాలాలే మనిషిని శాసిస్తాయా అని అడిగితే ఠక్కున సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే, సాధారణంగా ఆ అనుశాసనం భార్యా భర్తల సంబంధంలా పరస్పరమవుతుంది; మనిషి స్థలకాలాలను శాసిస్తున్నట్టు కనిపి స్తూనే, స్థలకాలాల శాసనానికి లొంగిపోతూ ఉంటాడు. ఈ క్షణాన ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాలలో అదే జరుగుతోంది. ఇంటర్నెట్ వంటి అత్యాధునిక సాంకేతిక సంపత్తి అందుబాటులోకి వచ్చి స్థలకాలాలతో మనిషి సంబంధంలో అనూహ్యమైన వేగమూ, అనేకమైన మార్పులూ తెచ్చి అతణ్ణి అరచేతి బొమ్మలా ఆడిస్తోంది. తను కనిపెట్టిన సాంకేతికత చేతిలో ఒక్కోసారి తనే చిత్తవుతూ మనిషి కళ్ళు తేలేయవలసివస్తోంది. ఎంతమంది గమనించారో కానీ, ఈ అత్యాధునిక సాంకేతికత పుణ్యమా అని కవి, రచయితలతో సహా ఏదో ఒక రచనారంగానికి చెందిన బుద్ధిజీవులందరూ ఈరోజున స్థలకాలసంబంధమైన ఒక సమస్యను ఎదుర్కొంటున్నారు. ఒక రచన ఆక్రమించుకునే జాగాను ఇక్కడ స్థలమనుకుంటే, ఆ రచన పాఠకులు, లేదా శ్రోతలముందుకు రావడానికి పట్టే సమయాన్ని కాలమనుకుందాం. లిపీ, లేఖనం అభివృద్ధి చెందని మౌఖిక సంప్ర దాయపు రోజుల్లో కవీ లేదా కథకుడూ-- శ్రోతలూ ఎదురెదురుగా ఉండేవారు కనుక స్థల కాలసంబంధమైన అంతరాలు ఉండేవికావు. లేఖన సంప్రదాయం వచ్చి, తాళపత్రాల దశను కూడా దాటి కాగితం మీద రాయడమూ, ముద్రించడమూ, ఆపైన పత్రికలూ వచ్చాక కాగితం మీద ఆ రచన ఆక్రమించుకునే నిడివి రూపంలో స్థలమూ, పాఠకులకది చేరే వ్యవధి రూపంలో కాలమూ ప్రముఖంగా అడుగుపెట్టాయి. ఇలాంటి లేఖనసంప్రదాయం తాళపత్రాల తో మొదలుపెట్టి, వందల సంవత్సరాల పాటు కొనసాగిన తర్వాత మళ్ళీ మనం స్థలకాల అంతరాలకు అవకాశం లేని వెనకటి మౌఖిక సంప్రదాయపు రోజులకు చేరుకున్నాం! ఎలాగంటే, ఆ సంప్రదాయంలో కవులూ, కథకులూ తమ రచనను శ్రోతలకు తక్షణమే అందించినట్టుగా ఈరోజున ఇంట ర్నెట్ ఆధారిత సామాజిక మాధ్యమాల్లో రచయితలు తమ రచనలను పాఠకులకు తక్షణమే అందించగలుగు తున్నారు; దానికి తోడు, లేఖన, ముద్రణానుభవాలకుభిన్నంగా ఈ మాధ్యమాల్లో స్థలపరిమితులు కూడా పూర్తిగా మాయమవుతున్నాయి. ఈవిధంగా రచనాకాలచక్రం చిత్రంగా తిరిగి బయలు దేరినచోటికే వచ్చింది! మారిన ఈ పరిస్థితికి అనుగుణంగా తాము మారి, తమ రచనలను ఎలా మలచు కోవాలన్నదే ఈ రోజున ఎంతోమంది రచయితలు అప్రకటితంగా ఎదుర్కొంటున్న సమస్య. ఉదాహరణకే చూడండి, ఆయా రచనాప్రక్రియల్లో చేయి తిరిగినవారిలో అనేకులు నిన్నటివరకూ దిన, వార, మాస పత్రికలు నిర్దేశించిన స్థలకాలపరిమితులకూ, ప్రమాణాలకూ లోబడి రాయడానికి అలవాటుపడినవాళ్ళు; అలాగే తమ రచన పాఠకు లకు చేరేందుకు పట్టే వ్యవధికీ మానసికంగా సిద్ధమై ఉండేవారు. నేరుగా పుస్తకరూపంలో తమ రచనల్ని ముద్రించుకునేవారూ దాదాపు ఈ కోవలోకే వస్తారు. కానీ ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల వ్యాప్తితో స్థలకాలపరిమితులే కాక, ప్రమాణాలను నిర్దేశించుకుని పరిష్కరణ బాధ్యత వహించే సంపాదకవర్గం కూడా మటుమాయమై ప్రతి రచయితా, కవీ, కథకుడూ తన 'గోడ'కు తనే యజమానిగా, సంపాదకుడిగా అదనపు బాధ్యతలను మోయవలసివస్తోంది. రచన చేయడానికే తప్ప పాఠకులకు దానిని చేర్చడానికి పట్టే వ్యవధి క్షణాలకు కుదించుకుపోవడం ఒక సానుకూల పరిణామనుకున్నా, స్థలపరి మితులు మాయమైపోయిన స్థితిలో పాఠకుల సహనమే కొలమానంగా పరిమితులను నిర్ణయించుకోవలసిన బాధ్యతా రచనాకారులపైనే పడుతోంది. అంతేకాదు, పత్రికలవంటి మాధ్యమాలు నిర్దేశించిన చట్రంనుంచి రచనలు తప్పుకుని వస్తురూపాలూ, అభివ్యక్తుల పరంగా కొత్తరూపాలు ధరించడమూ జరుగుతోంది. ఆపైన సామాజిక మాధ్యమాలు నిపుణరచయితలతో ప్రారంభించి, అరకొరగా అక్షరజ్ఞానం ఉన్నవారి వరకూ అందరికీ అందుబాటులోకి రావడంతో తమ స్థాయినీ, ప్రత్యేకతనూ నిలుపు కోవడం చేయి తిరిగిన రచనాకారులకు సవాలుగా మారుతోంది. స్థల, కాలనిర్బంధాలకు అతీతంగా తమవైన అద్భుత సృజనశక్తులను చాటుకుంటూ మహాకవులుగా, కథకులుగా, నవలాకారులుగా చిరకీర్తినందుకున్న చరిత్రా అనేకమంది సాహిత్యకారులకుంది కనుక, ఇప్పుడూ అదే జరగడం తథ్యమే కానీ, దానికి ఎంత వ్యవధి పడుతుందన్నదే ప్రశ్న!

నెతన్యాహూకు అగ్నిపరీక్ష!

బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా ఆదివారంనాటి అధ్యక్ష ఎన్నికల్లో సాధించిన విజయంతో నిండా షాక్‌లో మునిగిపోయిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... 120 మంది సభ్యులుండే ఇజ్రాయెల్ పార్లమెంటు కెనెసెట్‌కు మంగళవారం జరిగే ఎన్నికల్లో తన ఆప్తమిత్రుడు ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ పరిస్థితి ఏమవుతుందోనని బెంగటిల్లి ఉంటారు. మూడేళ్ల క్రితమైతే నెతన్యాహూ ఓటమి ఖాయమని అందరూ ఘంటాపథంగా చెప్పేవారు. ఎందుకంటే న్యాయసంస్కరణల పేరుతో సుప్రీంకోర్టు అధికారాలకు కోత పెడుతూ ఆయన ప్రభుత్వం 2023లో చట్టం తెచ్చాక దేశంలో ఉద్యమాలు పెల్లుబికాయి. తనపై ఉన్న అవినీతి కేసుల్ని తప్పించుకోవటానికే ఆ చట్టం తెచ్చారని అన్ని వర్గాలూ విరుచుకుపడ్డాయి. న్యాయమూర్తుల నియామకాన్ని ప్రభుత్వ నియంత్రణలోకి తెచ్చు కోవటంతో పాటు... పార్లమెంటు తెచ్చే ఏ చట్టాన్నయినా రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించటానికి దానికుండే అధికారాన్ని కూడా ఆ చట్టం రద్దు చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాధారణ మెజారిటీతో పార్లమెంటు తోసిపుచ్చడానికి కూడా అది వీలుకల్పించింది. రెండేళ్ల క్రితం ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు 8--7 మెజారిటీతో కొట్టేసింది. పర్యవసానంగా అవినీతి కేసుల కత్తి నెతన్యాహూపై వేలాడుతోంది. 2023 అక్టోబర్‌లో ఉగ్రవాద సంస్థ హమాస్ పలువురు ఇజ్రాయెల్ పౌరుల్ని హతమార్చి, అనేకమందిని కిడ్నాప్ చేశాక పరిస్థితి మారింది. గాజాపై నెతన్యాహూ సైన్యాన్ని నడిపించి వేలాదిమంది పౌరుల్ని ఊచకోత కోయించారు. గ్రామాలకు గ్రామాలు నేలమట్టం అయ్యాయి. తాను తప్ప ఎవరూ దేశాన్ని రక్షించలేరన్న అభిప్రాయం కలగజేయటానికి ఆయన మూడేళ్లుగా ఆ నరమేధాన్ని సాగిస్తూనే ఉన్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా నెతన్యాహూ దేశ రాజకీయాలను శాసిస్తున్నారు. అన్ని సర్వేలూ అధికార కూటమి లేదా విపక్ష కూటమి పూర్తి స్థాయి మెజారిటీ తెచ్చుకునే అవకాశం లేదని చెబుతున్నాయి. ఈ అనిశ్చితి కూడా నెతన్యాహూకే తోడ్పడుతుంది. ఇజ్రాయెల్‌లో మితవాద పక్షాలదే ఎప్పుడూ పైచేయి. అయితే గత ఎన్నికల్లో నెతన్యాహూ నెలకొల్పినలాంటి అతి మితవాద ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేదు. అందరూ దూరంపెట్టిన అతి తీవ్ర మతవాద పక్షాలను అధికారాన్ని నిలుపుకోవటం కోసం, జైలుశిక్ష తప్పించుకోవటం కోసం ఆయన చేరదీశారు. ఆ పక్షాలకు ఉదారవాద విధానాలు ప్రబల శత్రువులు. దౌత్యంకన్నా యుద్ధమే మేలైనదని వారి దృఢవిశ్వాసం. పాలస్తీనా భూభాగాన్ని మొత్తం స్వాధీనం చేసుకుని విశాల ఇజ్రాయెల్ నెలకొల్పటం వారి ధ్యేయం. ఆ సిద్ధాంతాన్ని సాకారం చేసి, దేశంలో తిరుగులేని నేతగా నిలిచిపోవాలని నెతన్యాహూ వాంఛించారు. హమాస్ దాడి ఆయనకు ఈ అవకాశాన్నిచ్చింది. అయితే మూడేళ్లుగా నిరాయుధ గాజా పౌరులపై సాగిస్తున్న ఊచకోత కొంతమేర విజయాన్నిచ్చి నట్టు కనబడ్డా, ప్రతిఘటన మాత్రం చల్లారలేదు. దేశం మొత్తం యుద్ధంలో చిక్కుకుంది. పాలస్తీనా పౌరుల వరకూ ఇజ్రాయెల్‌లో ఎవరొచ్చినా ఒకటే. సిద్ధాంతాలు వేరైనట్టు కనబడినా, ఆ పార్టీలన్నీ పాలస్తీనా స్వతంత్ర ప్రతిపత్తికి వ్యతిరేకం. హమాస్ దాడి, గాజా ఊచకోత అనంతరం ఇజ్రాయెల్ సమాజం మరింత పిడివాదంలోకి జారుకుంది. అందుకే విపక్షాలు గాజాకు భిన్నమైన పరిష్కారం చెప్పడంలేదు. న్యాయసంస్కరణలు రద్దు చేస్తామని మాత్రమే అంటున్నాయి. నెతన్యాహూ కోసం ట్రంప్ తన వంతుగా సాయం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఓటేయటానికి అమెరికాలో స్థిరపడిన ఇజ్రాయెలీ పౌరులు మందలుగా పోవటం ఆయన చలవే. అటు బ్రెజిల్‌లో లూలా ఓటమికి ప్రయత్నించినట్టే ఇక్కడా చేతనైనంత చేస్తున్నారు. కానీ జైలుశిక్ష అనుభవిస్తున్న బోల్సొనారో కుమారుడు ఫ్లేవియో ఓటమి పాలు కాకతప్పలేదు. ఇప్పుడు నెతన్యాహూ భవితవ్యం ఏమిటన్న ఉత్కంఠ అందరిలో ఉంది. నెతన్యాహూ ఏలుబడిలో ఇజ్రాయెల్ తెంపరితనం పెరిగింది. అది మిత్రుల సలహాలను కూడా బేఖాతరు చేస్తుందనీ, తమకు వీసమెత్తు విలువీయదనీ పాశ్చాత్య దేశాల ప్రభుత్వాలు భావిస్తున్నాయి. నెతన్యాహూ చిత్తుగా ఓడిపోవాలని ఆ దేశాల జనం కూడా కోరుకుంటున్నారు. దారితెన్నూ లేని ఈ నిరంతర యుద్ధం అంతిమంగా దేశ భవిష్యత్తుకు చేటు తెస్తుందని ఇజ్రాయెల్ పౌరులు గ్రహిస్తారా లేదా అన్నది ఈ ఎన్నికల ఫలితాలు తేలుస్తాయి.

సర్ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నాం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలు అన్నింటినీ ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులు ఏకగ్రీవంగానే తీసుకున్నారని భారత ఎన్నికల సంఘం సుప్రీం కోర్టుకు తెలిపింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలను తోసిపుచ్చింది. ఇదే సమయంలో సర్ ఉత్తర్వుల ద్వారా ఓటరు నమోదు కోసం ఉపయోగించేటువంటి ఫారం- 6 ను కూడా సవరించలేదని స్పష్టం చేసింది. సీఈసీ పనితీరు, ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని నిర్ణయాల చట్టబద్ధతను సవాలు చేస్తూ రాకేశ్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌కు సమాధానంగా ఈసీ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ దాఖలు చేసిన ఈ అఫిడవిట్‌కు సీఈసీతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కూడా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ప్రచురించిన రిపోర్ట్ ప్రకారం- సర్ ప్రక్రియకు సంబంధించి 14 కీలక నిర్ణయాలు తీసుకునే సమయంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆరోపణలు వచ్చాయి. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి 2025 జూన్ 24, 2025 అక్టోబర్ 27, 2026 మే 14 తేదీల్లో జారీ చేసిన మూడు ఉత్తర్వులు కమిషన్ ఏకగ్రీవ నిర్ణయాలేనని ఈసీ తన తాజా అఫిడవిట్‌లో స్పష్టం చేసింది.

అభిప్రాయాలు, ఆలోచనలన్నీ తుది నిర్ణయాలు కావు!

ఫైళ్ల పరిశీలన సమయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఇతర కమిషనర్లు వ్యక్తపరిచే అభిప్రాయాలు, ప్రశ్నలు,



సూచనలు, వ్యాఖ్యలను మాత్రమే కమిషన్ తుది నిర్ణయాలుగా పరిగణించలేమని ఈసీ వివరించింది. సాధారణంగా ఒక ఫైల్ ముందుగా ఒక ఎన్నికల కమిషనర్ వద్దకు, ఆ తర్వాత రెండో కమిషనర్ దగ్గరికి, చివరికి సీఈసీ వద్దకు వెళ్తుందని పేర్కొంది. 2023లో రూపొందించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం, సర్వీస్ నిబంధనలు, పదవీ కాలానికి సంబంధించిన చట్టంలోని సెక్షన్ 18 ను కూడా ఈసీ ఈ సందర్భంగా ప్రస్తావించింది. దీని ప్రకారం- సాధ్యమైనంత వరకు నిర్ణయాలను ఏకగ్రీవంగా తీసుకోవాలని, అలా సాధ్యం కాకపోతే మెజార్టీ ఆధారంగా నిర్ణయం తీసుకోవచ్చని ఎన్నికల సంఘం- సుప్రీం కోర్టుకు తెలిపింది. ఇంకా పిటిషన్‌లోని ఆరోపణలు ప్రధానంగా వార్తా పత్రిక కథనాన్ని ఆధారంగా చేసుకున్నవేనని, పిటిషనర్ సంబంధిత అధికారులతో స్వతంత్రంగా వాస్తవాలను నిర్ధరించుకోలేదని కమిషన్ వాదించింది. అందువల్ల ఈ పిటిషన్ అసలు విచారణకే అర్హత పొందాల్సింది కాదని, ఇంకా తాము అంతర్గత ఫైల్స్ లేదా నోట్స్‌ను మీడియాకు కూడా విడుదల చేయలేదని వెల్లడించింది. కాబట్టి సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరిన పిటిషన్ చట్టబద్ధంగా నిలబడదని ఈసీ వాదించింది.

ఫారం- 6 ను కూడా సవరించలేదు

ఓటర్ల జాబితాలో పేర్లను చేర్చడానికి ఉపయోగించే ఫారం- 6 ను సర్ ఉత్తర్వుల ద్వారా సవరించారన్న ఆరోపణలను కూడా ఎన్నికల సంఘం ఖండించింది. అయితే ఓటరు నమోదు నిబంధనలు, 1960 కింద నిర్దేశించిన ఫారంలో మార్పులు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉంటుందని వివరించింది. సర్ ఉత్తర్వుల సమయంలో తాము కోరిన డిక్లరేషన్ ఒక ప్రత్యేక డాక్యుమెంట్ మాత్రమేనని, దానినే ఫారం- 6 ను సవరించినట్లుగా పరిగణించవద్దని తెలిపింది. గతంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితాలతో తమకు లేదా తమ తల్లిదండ్రులు, తాత ముత్తాతలకు ఉన్న సంబంధాన్ని వివరించాలని దరఖాస్తుదారులను కోరడం వివాదానికి కారణమైంది. ఈ మార్పులపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు తెలిపారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రచురించింది. అయితే ఇక్కడ ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రాసెస్‌లో డిక్లరేషన్‌ను చూపించిన తీరు వల్ల ఫారం- 6 ను సవరించినట్లు భావించే అవకాశం ఉందని ఈసీ అంగీకరించింది. ఈ సమస్యను పరిష్కరించడానికి 2026, అక్టోబర్ 21 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో ఫారం- 6, సర్ డిక్లరేషన్‌ను రెండు వేర్వేరు భాగాలుగా చూపిస్తామని తెలిపింది.

దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యానికి పెద్దపీట

బ్రిక్స్ దేశాల మధ్య పార్లమెంటరీ సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై భారత్ దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల నుంచి వచ్చిన పార్లమెంటరీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. దిల్లీలోని సంవిధాన్ సదన్‌లో జరుగుతున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ ప్రారంభ సమావేశం అనంతరం ఈ భేటీ జరిగింది.

వివిధ దేశాలకు చెందిన పార్లమెంటు సభ్యులను ప్రధాని నరేంద్ర మోదీ సాదరంగా ఆహ్వానించారు. తర్వాత కొంతమంది సభ్యులతో ముచ్చటించిన మోదీ, పార్లమెంట్ భవన సముదాయంలో బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను ఉద్దేశించి ప్రసంగించిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, అంతర్జాతీయ వేదికలపై గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను బలంగా వినిపించాల్సిన బాధ్యత బ్రిక్స్ దేశాలపై ఉందన్నారు. సంస్కృతి, భాషా పరంగా వైవిధ్యాలు ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసమే బ్రిక్స్ దేశాలను ఐక్యంగా ఉంచుతోందని తెలిపారు. యుద్ధాలు, ఆర్థిక అస్థిరత, వాణిజ్య ఉద్రిక్తతలు, ఉగ్రవాదం వంటి సవాళ్లతో ప్రపంచం అనిశ్చితిని ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడానికి చర్చలు, దౌత్యం ఎంతో అవసరమని ఓంబిర్లా పేర్కొన్నారు.

పార్లమెంటరీ వ్యవస్థలో ఆవిష్కరణలు అవసరం

ప్రజాస్వామ్య సంస్థల పనితీరును మెరుగుపరచడంలో ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని లోక్‌సభ స్పీకర్ పేర్కొన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడమే ఆవిష్కరణ కాదని, కొత్త ఆలోచనలు, ప్రగతిశీల విధానాలు, సంస్థాగత సంస్కరణలు కూడా అందులో భాగమేనని వివరించారు. ఈ మార్పుల ద్వారా పార్లమెంటరీ వ్యవస్థను మరింత సమర్థంగా, పారదర్శకంగా, ప్రజల భాగస్వామ్యానికి అనుకూలంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. చర్చల నాణ్యతను పెంచడం, ప్రజలతో అనుసంధానాన్ని మెరుగుపరచడం, వారి మారుతున్న అంచనాలకు అనుగుణంగా స్పందించడం



సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెరగాలంటే పార్లమెంట్లు పారదర్శకంగా పనిచేయడంతో పాటు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం

యువత ఆశయాలు, ఆలోచనలు, సమస్యలను పార్లమెంట్లు శ్రద్ధగా వినాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. యువతలోని శక్తి, సృజనాత్మకత, నైపుణ్యాలను దేశ అభివృద్ధికి ఉపయోగపడేలా మార్గనిర్దేశం చేయాల్సిన బాధ్యత పార్లమెంట్లపై ఉందని అన్నారు. వారి ఆశలు, ఆందోళనలను అర్థం చేసుకుని, విధాన రూపకల్పనలో యువత అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలు కాలానుగుణంగా మారుతున్నందున పార్లమెంటరీ వ్యవస్థలు కూడా ఆ మార్పులకు అనుగుణంగా అభివృద్ధి చెందాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం కల్పించిన అధికారాలే ప్రజాస్వామ్య సంస్థల బలం కాదని, నిర్మాణాత్మక చర్చలు, ఏకాభిప్రాయ సాధన, పారదర్శకత, ప్రజలకు జవాబుదారీతనం కూడా అంతే ముఖ్యమని వివరించారు.

పార్లమెంటరీ సహకారంపై చర్చలు

బ్రిక్స్ దేశాల పార్లమెంటరీ నేతలు, ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఈ ఫోరమ్ పరస్పర సహకారాన్ని పెంపొందించడం, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంపై చర్చించేందుకు అవకాశం కల్పిస్తోంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు.

పలు దేశాల ప్రతినిధుల హాజరు


ఈ ఫోరమ్‌లో బ్రెజిల్, రష్యా, చైనా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఇరాన్ వంటి బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. భాగస్వామ్య దేశాల నుంచి బెలారస్, క్యూబా, థాయ్‌లాండ్, ఉగాండా, వియత్నాం, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్ ప్రతినిధులు హాజరయ్యారు. భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్‌తో పాటు పలువురు పార్లమెంటు సభ్యులు కూడా విదేశీ ప్రతినిధులతో సమావేశమయ్యారు.

రక్షణ రంగానికి భారీ బూస్ట్

న్యూఢిల్లీ: దేశ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ దళాల కోసం రూ.2.12 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాల కొనుగోలు ప్రతిపాదనలకు రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కొనుగోళ్లలో తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లు, దీర్ఘశ్రేణి కామికేజ్ డ్రోన్లు, ఆధునిక ఆయుధ వ్యవస్థలు, నిఘా పరికరాలు ఉన్నాయి.

సైన్యం కోసం ఆధునిక ఆయుధ వ్యవస్థలు

భారత సైన్యం కోసం అధిక చలనశీలత కలిగిన వాహనాలు, స్వయంచాలక ట్రాక్డ్ గన్ వ్యవస్థలు, గన్‌షాట్ రెస్పాన్స్ సిస్టమ్ (జీఎస్ఆర్ఎస్), తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లు, అత్యల్ప శ్రేణి వైమానిక రక్షణ వ్యవస్థలు (వీఎస్‌హెచ్ఓఆర్ఏడీఎస్), డ్రోన్లను ఎదుర్కొనే వ్యవస్థలు (సీ-యూఏఎస్) కొనుగోలుకు ఆమోదం లభించింది. అలాగే ఇతర డ్రోన్ వ్యవస్థలు, మానవరహిత వైమానిక నిఘా వ్యవస్థలు, సమీకృత నిఘా-దాడి వ్యవస్థలు, దీర్ఘశ్రేణి కామికేజ్ డ్రోన్ల కొనుగోలుకు కూడా డీఏసీ పచ్చజెండా ఊపింది. ఈ వాహనాలు కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో సైన్యం కదలికలను, రవాణా సామర్థ్యాలను మెరుగుపర చనున్నాయి. స్వయంచాలక ట్రాక్డ్ గన్ వ్యవస్థలు వేగంగా కదులుతూ కాల్పులు జరిపేందుకు ఉపయోగపడతాయి. గన్‌షాట్ రెస్పాన్స్ సిస్టమ్ యుద్ధరంగంలో కాల్పులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించడంలో తోడ్పడుతుంది. తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లను భారత సైన్యం, వైమానిక దళం వినియోగించనున్నాయి.



నిఘా, శోధన, రక్షణ చర్యలు, సైనికుల తరలింపు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి అవసరాలకు వీటిని ఉపయోగించవచ్చు. అత్యల్ప శ్రేణి వైమానిక రక్షణ వ్యవస్థలు సమీప దూరంలో ఎదురయ్యే వైమానిక ముప్పులను అడ్డుకోవడానికి ఉపయోగపడతాయి. డ్రోన్లను గుర్తించి ఎదుర్కొనే వ్యవస్థలు సైనిక స్థావరాలు, యుద్ధ ట్యాంకులు, ఇతర కీలక రక్షణ వనరుల భద్రతను పెంచడంలో సహాయపడతాయి.

నౌకాదళం కోసం క్షిపణి నిరోధక వ్యవస్థలు

భారత నౌకాదళం కోసం యాక్టివ్ ఆఫ్‌బోర్డ్ డెకాయ్ సిస్టమ్ (ఏఓడీఎస్)తో పాటు ఇతర కీలక నౌకాదళ పరికరాల కొనుగోలుకు కూడా ఆమోదం లభించింది. శత్రువుల నౌకా విధ్వంసక క్షిపణులను దారి మళ్లించి, నౌకలకు రక్షణ కల్పించడంలో ఏఓడీఎస్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ వ్యవస్థ నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకల రక్షణ సామర్థ్యాలను మరింత పెంచనుంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి, నిర్మించనున్న నౌకాదళ పరికరాలు భారత నౌకాదళ పోరాట సామర్థ్యాలను బలోపేతం చేయనున్నాయి. దేశీయ సాంకేతిక పరిజ్ఞానానికి ప్రోత్సాహం లభించడంతో పాటు రక్షణ రంగంలో స్వావలంబన లక్ష్యానికి ఇవి దోహదపడనున్నాయి.

వైమానిక దళానికి అధునాతన పరికరాలు

భారత వైమానిక దళం కోసం హెలికాప్టర్లు, వైమానిక రక్షణ వ్యవస్థలు, ఆయుధాలు, మొబైల్ ఎక్స్-బ్యాండ్ డాప్లర్ వాతావరణ రాడార్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. హెలికాప్టర్లు వైమానిక రవాణా అవసరాలను తీర్చడంతో పాటు వివిధ కార్యాచరణల్లో ఉపయోగపడనున్నాయి. ఎక్స్-బ్యాండ్ డాప్లర్ వాతావరణ రాడార్లు సరిహద్దు, వ్యూహాత్మక ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని అందించనున్నాయి. దీనివల్ల వైమానిక కార్యకలాపాల ప్రణాళిక, నిర్వహణ మరింత సమర్థంగా సాగేందుకు అవకాశం ఉంటుంది.

దేశీయ పరిశ్రమలకు ప్రాధాన్యం

రక్షణ పరికరాల కొనుగోళ్లలో స్వదేశీ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం ఆమోదించిన కొనుగోళ్లలో సుమారు 82 శాతం విలువైన పరికరాలను భారతీయ పరిశ్రమల నుంచే సమకూర్చుకోనున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ నిర్ణయం దేశీయ రక్షణ తయారీ రంగానికి ఊతమివ్వడంతో పాటు, ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానంలో విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా దోహదపడనుంది. సైన్యం, నౌకాదళం, వైమానిక దళాల అవసరాలకు అనుగుణంగా ఆధునిక పరికరాలను సమకూర్చుకోవడం ద్వారా దేశ రక్షణ సామర్థ్యాలను మరింత పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ



పరువు నష్టం కేసులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఊరట లభించడంతో బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది కాంగ్రెస్. బీజేపీని నేరస్థులు నడిపే పార్టీగా అభివర్ణించింది. గాంధేయ మార్గంలో పోరాడి, ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఓడిస్తామని పేర్కొంది. బీజేపీ నేత అమిత్ షాపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయనపై నమోదైన పరువు నష్టం కేసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు నిర్దోషిగా సోమవారం ఉదయం ప్రకటించగా, ఆ తీర్పును కాంగ్రెస్ స్వాగతించింది. నిజం గెలిచిందని పేర్కొంది. బీజేపీ అధికారంలోకి రావడానికి నేరాలకు పాల్పడిన వారిని ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఆ పార్టీని ఓడించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అయితే ఆ పోరాటం హింసకు తావులేకుండా మహాత్మా గాంధీ చూపిన మార్గంలోనే సాగుతుందని చెప్పారు. ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఎదుర్కొంటామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 2018లో చేసిన వ్యాఖ్యల్లో పరువు నష్టం కలిగించే అంశం లేదని కోర్టు స్పష్టం చేసిందని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. అమిత్ షాను వ్యక్తిగతంగా కించపరచాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని రాహుల్ తరఫున హాజరైన న్యాయవాది వాదించారు. "ఈ కేసులో రాహుల్ గాంధీ నిర్దోషిగా విడుదలయ్యారు. ఫిర్యాదుదారునికి దావా వేసేందుకు చట్టపరమైన అర్హత లేదని కోర్టు నిర్ధారించింది. రాహుల్ గాంధీ నిర్దోషిగా తేలడం పట్ల ప్రస్తుతం మా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాం. తీర్పు ఉత్తర్వులను పూర్తిగా పరిశీలించలేదు. ఈ కేసును కొట్టివేయడానికి గల నిర్దిష్ట కారణాలు లేదా ప్రాతిపదిక ఏమిటో, పూర్తి తీర్పు ప్రతిని చూసిన తర్వాతే చెప్పగలము" అని రాహుల్ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా అన్నారు. తాజాగా ఆ కేసులో విచారణ పూర్తి చేసిన సుల్తాన్‌పుర్ ప్రత్యేక కోర్టు రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటించింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుభమ్ వర్మ తీర్పు వెలువరించారు. కోర్టు నిర్ణయంతో ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఆ కేసుకు ముగింపు లభించింది. తీర్పు వెలువడిన సమయంలో రాహుల్ గాంధీ కోర్టులోనే ఉన్నారు. అనంతరం ఆయన బయటకు రాగానే కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. దప్పులు కొడుతూ, మిఠాయిలు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు. 'సత్యమేవ జయతే' అంటూ నినాదాలు చేశారు. కోర్టు తీర్పు తమ వాదనకు బలం చేకూర్చిందని కాంగ్రెస్ భావిస్తోంది. అదే సమయంలో బీజేపీపై రాజకీయ విమర్శలను మరింత గట్టిగా వినిపించింది. 2018లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ వివాదం మొదలైంది. ఆ సమయంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. బెంగళూరులో జరిగిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారని వ్యాఖ్యానించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు అమిత్ షా ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ సుల్తాన్‌పుర్‌కు చెందిన బీజేపీ నేత విజయ్ మిశ్రా కోర్టును ఆశ్రయించారు. 2018 ఆగస్టు 4న విజయ్ మిశ్రా పరువు నష్టం ఫిర్యాదు దాఖలు చేశారు. ఆ కేసులో రాహుల్ గాంధీ 2023లో కోర్టుకు హాజరై బెయిల్ పొందారు. అనంతరం కేసు విచారణ కొనసాగింది. రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఫిర్యాదుదారుడు తప్పుబట్టగా, వాటిని సందర్భం నుంచి విడదీసి చూస్తున్నారని కాంగ్రెస్ నేత తరఫు న్యాయవాదులు వాదించారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ మరోసారి విమర్శలు గుప్పించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని రకాల మార్గాలను ఉపయోగిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఓటు చోరీకి సంబంధించి అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయని ఖర్గే అన్నారు. అయినప్పటికీ జ్ఞానేశ్ కుమార్‌కు రక్షణ కల్పించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద కోరితే, ఎన్నికల సంఘం వాణిజ్య రహస్యాలు అనే కారణంతో సమాధానం ఇవ్వడానికి నిరాకరించిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పారదర్శకత అవసరమని డిమాండ్ చేస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 16.18 లక్షల ఫామ్-6 దరఖాస్తులకు సంబంధించిన వివరాలను బహిరంగంగా వెల్లడించలేదని ఆరోపించారు. పిలిభిత్ జిల్లాలో 10,470 మంది ఓటర్ల రికార్డుల్లో అవకతవకలు గుర్తించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8 దరఖాస్తులపై విచారణకు ఆదేశించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ఓటరు జాబితాల్లో కొత్తగా పేర్లు చేర్చడం, తొలగించడం, వివరాల్లో మార్పులు చేయడం వంటి ప్రక్రియల్లో ఈ ఫారాలు కీలక పాత్ర పోషిస్తాయి.

మూడు ప్రధాన డిమాండ్లు

బీజేపీకి, ఎన్నికల సంఘానికి మధ్య కుమ్మక్కు ఉందన్నది ఇండియా కూటమి ఆరోపణ అని ఖర్గే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మూడు ప్రధాన డిమాండ్లను ముందుకు తెచ్చారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి. ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పించే 2023 చట్టాన్ని రద్దు చేయాలి. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి. అక్రమంగా తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలి. అన్ని ఎన్నికలను పేపర్ బ్యాలెట్ల ద్వారా నిర్వహించాలని కూడా ఖర్గే డిమాండ్ చేశారు. ఈ పోరాటం కేవలం ఓట్ల పరిరక్షణకే పరిమితం కాదని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రజా ఉద్యమమని వ్యాఖ్యానించారు.

భారీ ర్యాలీకి పిలుపు

ఓట్ చోరీకి వ్యతిరేకంగా నవంబర్ 1న దిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఖర్గే పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

మన్ కీ బాత్‌ను పక్కన పెట్టండి : జైరాం రమేశ్

మరోవైపు, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయంటూ ప్రధాని మోదీని కాంగ్రెస్ లక్ష్యంగా చేసుకుంది. దీపావళికి ముందు ఆహార పదార్థాలు, డ్రై ఫ్రూట్స్ ధరలు పెరగడం సామాన్య కుటుంబాల బడ్జెట్‌పై ప్రభావం చూపుతోందని జైరాం రమేశ్ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ను ప్రస్తావించిన ఓ మీడియా కథనాన్ని ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. కొన్ని ఆహార పదార్థాల ధరలు నిరంతరం పెరుగుతున్నాయని, దీంతో కుటుంబాల ఖర్చులు అధికమవుతున్నాయని ఆ కథనం పేర్కొన్నట్లు తెలిపారు. మరో కథనాన్ని ఉటంకిస్తూ పిస్తా, బాదం, జీడిపప్పు, యాలకుల ధరలు కూడా పెరిగాయని వెల్లడించారు.

ఉల్లిపాయలు, చక్కెర ధరల పెరుగుదలపై విమర్శలు

ప్రభుత్వ గణాంకాల ప్రకారం ద్రవ్యోల్బణం పెరుగుతోందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. గత నాలుగు నెలల్లో ఉల్లిపాయల ధరలు 85 శాతం, చక్కెర ధరలు 34 శాతం పెరిగాయని ఆయన తెలిపారు. గత నెలలోనే టమాటాల ధరలు 8.5 శాతం, కందిపప్పు ధరలు 3.5 శాతం, శనగపప్పు ధరలు 3.1 శాతం పెరిగాయని పేర్కొన్నారు. దీపావళికి ముందు కిలో బాదం ధర రూ.1,300కు చేరిందని, పచ్చి యాలకుల ధర కిలోకు రూ.300 మేర పెరిగిందని ఆయన ఆరోపించారు. ఈ ధరల పెరుగుదలతో పండుగ జరుపుకోవాలా? కుటుంబ ఖర్చులను ఎలా నిర్వహించాలా? అనే సందిగ్ధంలో సగటు కుటుంబాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

జాతీయ సరస్ మేళాలో లఖ్‌పతి దీదీలకు పారిశ్రామికాభివృద్ధి, పోషకాహారంపై శిక్షణ

విజయవాడ, మహానగర్

నగరంలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా 2026లో భాగంగా లఖ్‌పతి దీదీలకు పారిశ్రామికాభివృద్ధి, మార్కెటింగ్, ఆరోగ్యం, పోషకాహారంపై సోమవారం ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల్లో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడం, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలను విస్తరించడం, సహజ వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) లఖ్‌పతి దీదీ కార్యక్రమానికి సాంకేతిక భాగస్వామిగా ఉన్న బ్రాక్ ఇంటర్నేషనల్‌కు చెందిన ప్రతి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పెవిలియన్‌లో పారిశ్రామికాభివృద్ధి, మార్కెటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. వినియోగదారుల అవసరాలను గుర్తించడం, ఉత్పత్తుల ప్రత్యేకతను వివరించడం, నాణ్యతను మెరుగుపరచడం, ప్యాకేజింగ్, ధరల నిర్ణయం, పెట్టుబడులు, లాభాల నిర్వహణపై అవగాహన కల్పించారు. వ్యాపారం కోసం సమకూర్చుకున్న పెట్టుబడిని భద్రపరచుకోవడంతో పాటు లాభాలను వ్యాపార విస్తరణకు తిరిగి వినియోగించాలని సూచించారు. వాట్సాప్ బిజినెస్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్,



మీషో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, యూట్యూబ్ వంటి డిజిటల్ వేదికల ద్వారా ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు చేరవేయవచ్చని వివరించారు. మరోవైపు, నాలెడ్జ్ పెవిలియన్‌లో రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) ప్రతినిధులు నాగలత, దేవిక ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. నేల ఆరోగ్యం, మొక్కల ఆరోగ్యం, మానవ ఆరోగ్యం మధ్య ఉన్న సంబంధాన్ని వివరిస్తూ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) విధానంలో జీవ ఆధారిత వ్యవసాయ ఉత్పాదకాలు, బహుళ అంచెల పంటల సాగు, నీటి సంరక్షణ వంటి పద్ధతుల ప్రాధాన్యాన్ని వివరించారు. కుటుంబాల ఆహారంలో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లు చేర్చుకోవాలని, వంటింటి తోటలు, పెరటి కోళ్ల పెంపకం, పశువులు, చేపల పెంపకం ద్వారా పోషకాహార భద్రతను పెంపొందించుకోవచ్చని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలకు స్థానికంగా పండించిన సురక్షితమైన పోషకాహార ఉత్పత్తులను సరఫరా చేయడంలో రైతులు, ఎస్‌హెచ్‌జీల భాగస్వామ్యాన్ని వివరించారు. గ్రామీణ మార్టులు, ఆరోగ్యకరమైన చిరుతిళ్ల తయారీ యూనిట్లు వంటి వ్యాపారాల ద్వారా మహిళలు ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. పారిశ్రామిక శిక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు మహిళల ఆర్థిక సాధికారతతో పాటు ఆరోగ్యకరమైన కుటుంబాలు, స్థిరమైన జీవనోపాధుల అభివృద్ధికి దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఏపీఎస్ఆర్ఎల్ఎం/సెర్ప్) సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ సారస్ మేళా--2026 స్వయం సహాయక సంఘాల మహిళలకు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి, వ్యాపార అవకాశాలను విస్తరించుకోవడానికి జాతీయ స్థాయి వేదికగా నిలుస్తోంది.

కూటమి అభ్యర్థులు అపూర్వ విజయాలు సాధించాలి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్.. కొడాలిలో ఇంటింటి ప్రచారం

ఘంటసాల, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అపూర్వ విజయాలు సాధించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం ఘంటసాల మండలం కొడాలిలో ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి వల్ల రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ అస్తవ్యస్త పాలనతో అంధకారంలోకి వెళ్లిన రాష్ట్రానికి కూటమి ప్రభుత్వం వెలుగులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో దెబ్బతిన్న గ్రామీణ రహదారులను కేంద్రం సహకారంతో, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమకూర్చిన నిధులతో పల్లె పండుగ 1, 2, 3 కార్యక్రమాల ద్వారా నియోజకవర్గంలో సుమారు రూ.70 నుంచి రూ.80 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు నిర్మించి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచామని తెలిపారు. మరిన్ని నిధులు మంజూరుకు సిద్ధంగా ఉన్నాయని, నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. ఔట్‌ఫాల్ స్లూయిజ్‌ల నిర్మాణం, కృష్ణానది కరకట్ట అభివృద్ధి వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రి నిర్వహించిన కృష్ణా జిల్లా సమీక్ష, ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన నియోజకవర్గ సమీక్షలో చర్చించి ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారని, తద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా దర్బార్ల ద్వారా ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కరిస్తున్నామని, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పార్టీలకు అతీతంగా వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. ఘంటసాల



మండల జడ్పీటీసీ అభ్యర్థిగా సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న గుంటూరు బాపనయ్య మనుమరాలు, మాజీ ఎమ్మెల్యే డీవై దాస్ కోడలు దోవారి పవిత్రకు జనసేన తరఫున పోటీ చేసే అవకాశం రావడం గర్వకారణమన్నారు. ఎస్సీ జనాభా అధికంగా ఉన్న ఈ మండలంలో పవిత్ర వారికి అండగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కొడాలి ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తుమ్మల వరలక్ష్మి గతంలో ఎంపీపీగా, జడ్పీటీసీగా పనిచేసిన అనుభవంతో మండల అభివృద్ధికి, ముఖ్యంగా ఎస్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. పవిత్ర, వరలక్ష్మి నాయకత్వంలో నిరుపేదలకు మరింత మేలు జరగడంతో పాటు మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఘంటసాల మండలంలో కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులందరినీ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విక్కుర్తి శ్రీనివాసరావు, జనసేన మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు కోన రాజశేఖర్, డీసీ చైర్మన్ అయినంపూడి భానుప్రకాష్, డీసీ వైస్ చైర్మన్ పరిసే చలపతి, ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్ పైడిపాముల కృష్ణకుమారి, కూటమి నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, వేమూరి సాయి వెంకటరమణ, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సుగ్గన పవన్ కుమార్, కొండవీటి శ్రీనివాస్, యార్ల శ్రీకాంత్, పాటిబండ్ల నరేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్లను కలిసి మద్దతు కోరారు.

దేశంలోనే అతిపెద్ద పర్యావరణహిత ఆభరణ రంగవల్లి ఆవిష్కరణ

విజయవాడ, మహానగర్



భారతీయ సాంస్కృతిక వారసత్వానికి, పండుగ సంప్రదాయాలకు నివాళిగా ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన ప్రముఖ ఆభరణాల బ్రాండ్ ఇంద్రియా, భారతదేశంలోనే అతిపెద్ద పర్యావరణహిత ఆభరణ రంగవల్లిని బెంగళూరులో ఆవిష్కరించింది. రాజాజీనగర్‌లోని ఒరాయన్ మాల్, త్యాగరాజనగర్‌లోని శ్రీ సత్య గణపతి షిర్డీ సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో సుమారు 1,600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కళాఖండాన్ని రూపొందించారు. ఇంద్రియా పండుగ ప్రత్యేక కలెక్షన్ పద్మిక్ ఆభరణాల డిజైన్ స్ఫూర్తితో రూపొందించిన ఈ రంగవల్లిలో బియ్యం, రాగులు, కొర్రలు తదితర చిరుధాన్యాలు, సహజ ధాన్యాలను ఉపయోగించారు. 22 క్యారెట్ల బంగారంతో రూపొందించిన పద్మిక్ ఆభరణ శ్రేణిలో ప్రాచీన గులాబీ మీనాకారీ కళకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రముఖ రంగోలి కళాకారిణి శిఖా శర్మ తన నైపుణ్యాన్ని అందించారు. ఇంద్రియా మార్కెటింగ్, విజువల్ మర్చండైజింగ్ హెడ్ శాంతిస్వరూప్ పాండా మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, హస్తకళలను సమకాలీన రూపంలో ప్రజలకు చేరువ చేయడమే తమ లక్ష్యమన్నారు. విజయదశమి అనంతరం రంగవల్లి తయారీలో ఉపయోగించిన ధాన్యాలు, పప్పుదినుసులను గోశాల సహకారంతో పక్షులు, మూగజీవాలకు ఆహారంగా అందించనున్నారు. ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ నిర్వహిస్తున్న రంగవల్లి పోటీలో ఎంపికైన 100 మంది విజేతలకు 22 క్యారెట్ల బంగారు నాణేలను బహుమతిగా అందించనున్నారు.

డిసెంబర్ 9 నుంచి చెన్నైలో 10వ యూనిఫామ్ తయారీదారుల ప్రదర్శన

విజయవాడ, మహానగర్



సోలాపూర్ గార్మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఎస్‌జిఎంఎ) ఆధ్వర్యంలో 10వ 'యూనిఫామ్ తయారీదారుల ప్రదర్శన--2026' డిసెంబర్ 9 నుంచి 11 వరకు చెన్నైలోని నందంబక్కమ్ చెన్నై ట్రేడ్ సెంటర్, హాల్ నెం. 4లో నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా 150కి పైగా ప్రముఖ బ్రాండ్లు పాల్గొనే ఈ మూడు రోజుల బి2బి ప్రదర్శనలో 25,000కు పైగా యూనిఫామ్, ఫ్యాబ్రిక్ డిజైన్లతో పాటు టవళ్లు, చాదర్లు, నాప్కిన్ల విస్తృత శ్రేణిని ప్రదర్శించనున్నారు. దేశంలో తొలిసారిగా యూనిఫామ్, టవల్ తయారీదారులు ఒకే వేదికపై తమ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానున్నారు. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, పారిశ్రామిక, కార్పొరేట్, హాస్పిటాలిటీ రంగాలకు అవసరమైన దుస్తులు, పాదరక్షలు, బ్యాగులు, టైలు, బెల్టులు, టవళ్లు తదితర ఉత్పత్తులు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు, రిటైలర్లు, సంస్థల కొనుగోలుదారులు తయారీదారులతో నేరుగా వ్యాపార సంబంధాలు ఏర్పరచుకునేందుకు ఈ ప్రదర్శన దోహదపడుతుందని ఎస్‌జిఎంఎ ప్రదర్శన ఛైర్మన్ అశోక్ చవాన్ తెలిపారు. 2017లో ప్రారంభమైన ఈ ప్రదర్శన ఇప్పటివరకు 300 మందికి పైగా కొత్త పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించిందని నిర్వాహకులు వెల్లడించారు.

వైభవంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ





విజయవాడ, మహానగర్

ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై సోమవారం ఉదయం గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా ప్రారంభమైంది. ఘాట్ రోడ్డు ప్రవేశద్వారం వద్ద ఉన్న శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఆలయ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి, శ్రీ విఘ్నేశ్వరుడు, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ ఆంజనేయస్వామి తదితర దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రి చుట్టూ పౌర్ణమి రోజున ప్రదక్షిణ చేయడం విశేష ఫలప్రదమని భక్తుల విశ్వాసం. దేవస్థానం ఆధ్వర్యంలో ధర్మప్రచారంలో భాగంగా సంప్రదాయ కోలాట నృత్యాలు, భజన సంకీర్తనలు, మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణ కొనసాగింది. ఘాట్ రోడ్డు అమ్మవారి ఆలయం, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి మీదుగా తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకునేలా ప్రదక్షిణ మార్గాన్ని నిర్ణయించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో పలుచోట్ల స్థానిక మహిళలు రహదారులను పసుపు నీటితో శుద్ధి చేసి, హారతులు ఇచ్చి, కొబ్బరికాయలు సమర్పిస్తూ జయజయధ్వానాలు చేశారు. దేవస్థానం తరఫున భక్తులకు అమ్మవారి కుంకుమ, ప్రసాదాలను పంపిణీ చేశారు. వేలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొని అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కిషోర్ కుమార్, సూపరింటెండెంట్ హేమ దుర్గాంబ, సీనియర్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో వైసీపీ విస్తృత ప్రచారం



విజయవాడ, మహానగర్

స్థానిక 30వ డివిజన్ పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని సోమవారం విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, 30వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థి జోగరాజుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజలను కలుసుకుంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరుతూ ప్రచారాన్ని కొనసాగించారు. మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ప్రచార కార్యక్రమం సందడిగా సాగింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతు కోరుతూ డివిజన్ పరిధిలో ప్రచారాన్ని నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



బిజినెస్

ప్రైవేటు బ్యాంకులు.. పటిష్ట లాభాలు



ప్రయివేట్ రంగ దిగ్గజం కొటక్ మహీంద్రా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2026--27) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. వార్షికంగా జూలై--సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 26 శాతం ఎగసి రూ. 5,645 కోట్లకు చేరింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 29 శాతం జంప్‌చేసి రూ. 4,212 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం, ప్రొవిజన్లు తగ్గడం ఇందుకు సహకరించింది. నికర వడ్డీ ఆదాయం 16 శాతం వృద్ధితో రూ. 8,459 కోట్లకు చేరింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.39 శాతం నుంచి 1.04 శాతానికి దిగివచ్చాయి. స్లిప్పేజీలు రూ. 1,629 కోట్ల నుంచి రూ. 1,230 కోట్లకు తగ్గాయి. మొత్తం ప్రొవిజన్లు 15 శాతం వెనకడుగుతో రూ. 803 కోట్లకు పరిమితమయ్యాయి. ప్రయివేట్ రంగ సంస్థ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2026--27) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. వార్షికంగా జూలై--సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం మూడు రెట్లు దూసుకెళ్లి రూ. 1,045 కోట్లకు చేరింది. గతేడాది(2025--26) ఇదే కాలంలో కేవలం రూ. 352 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 11,828 కోట్ల నుంచి రూ. 14,218 కోట్లకు జంప్‌చేసింది. వడ్డీ ఆదాయం సైతం రూ. 9,937 కోట్ల నుంచి రూ. 11,922 కోట్లకు ఎగసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.86 శాతం నుంచి 1.32 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.52 శాతం నుంచి 0.4 శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి 14.67 శాతంగా నమోదైంది.

నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్..
లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు (్రశీషిఎ ఎుతీఎవ్) లాభాల్లో ముగిశాయి. ఓ వైపు అంతర్జాతీయంగా చమురు ధరలు గరిష్ఠ స్థాయిల వద్ద కొనసాగుతున్నప్పటికీ.. ఫార్మా, హెల్త్‌కేర్, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. దీంతో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 72,990.04 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,123.83) నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటి తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ.. చివరికి 482.92 పాయింట్ల లాభంతో 73,606.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 153.20 పాయింట్ల లాభంతో 22,753.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.19గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా, ట్రెంట్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజుకీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 115 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4018 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

నగదు చలామణిలో వృద్ధి అయిదేళ్ల గరిష్ఠానికి



దేశీయంగా ఈనెల 15వ తేదీ నాటికి చలామణిలో ఉన్న నగదు విలువ రూ.43.46 లక్షల కోట్లకు చేరిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. గతేడాది ఇదే సమయం కంటే ఇది 13.5% ఎక్కువని, ఈ వృద్ధి అయిదేళ్ల గరిష్ఠమని వెల్లడించింది. రిజర్వ్ మనీ కూడా 10.3% వృద్ధితో రూ.53.24 లక్షల కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు 30తో ముగిసిన పక్షంలో కూడా చలామణిలో ఉన్న నగదు వృద్ధి 13.3 శాతంగా నమోదైంది.

ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్ల వల్లేనా?

రూపాయి పతనాన్ని ఆపే లక్ష్యంతో జూన్ 8న ప్రవేశపెట్టిన ఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ (బ్యాంక్) /ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్ పథకమూ చలామణిలో ఉన్న కరెన్సీ వృద్ధికి ప్రధాన కారణాల్లో ఒకటిగా భావిస్తున్నారు. ఈ పథకం కింద ఆగస్టు 31 వరకు బ్యాంకులు 133 బిలియన్ డాలర్లు సమీకరించాయి.

2025-26లో బహిరంగ మార్కెట్ కార్యకలాపాల ద్వారా రూ.8.8 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను ఆర్‌బీఐ కొనుగోలు చేసి, వ్యవస్థలో ద్రవ్య లభ్యత పెంచింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ స్వాప్ సదుపాయాల ద్వారా ద్రవ్య లభ్యత పెంచింది.

ప్రస్తుతం అదనపు ద్రవ్య లభ్యతను ఉపసంహరించుకోవడాన్ని ఆర్‌బీఐ ప్రారంభించింది. విదేశీ మారకపు ద్రవ్య మార్కెట్లో ఆర్‌బీఐ జోక్యం కొనసాగడం, పండగల సమయంలో ప్రజలు అధికంగా నగదు వినియోగించడం వల్ల.. బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత మరింత తగ్గొచ్చు. దీనివల్ల రిజర్వ్ మనీ వృద్ధి మందగించే అవకాశం ఉంది.

ఒడుదొడుకులు తట్టుకుంటున్నాం

మన దేశం ఇంధనాన్ని అధికంగా దిగుమతి చేసుకుంటున్నా.. దేశీయ వినియోగం/సేవల రంగం బలంగా ఉండటం వల్ల ప్రపంచ ఆర్థిక పరిణామాల ప్రభావాన్ని తట్టుకోగలుగుతున్నట్లు ఆర్‌బీఐ వివరించింది. రిటెయిల్ ద్రవ్యోల్బణం పెరుగుతూ, వివిధ వస్తువుల ధరలు అధికమవుతున్నందున.. నియంత్రణకు తగిన ద్రవ్య విధాన చర్యలు అవసరమని ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు.

హ్యుందాయ్ నుంచి మిడ్‌సైజ్ ఎస్‌యూవీ

ఇంటర్నెట్ డెస్క్: హ్యుందాయ్ మోటార్ ఇండియా మిడ్‌సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో బేయాన్‌ను లాంచ్ చేసింది. దీని ధరను రూ.9.99 లక్షలుగా (ఎక్స్ షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. హ్యుందాయ్ వెబ్‌సైట్ లేదా ఆథరైజ్డ్ డీలర్‌షిప్స్ వద్ద రూ.11 వేలు చెల్లించి దీనిని బుక్ చేసుకోవచ్చు. మిడ్‌సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో మారుతీ సుజుకీ విక్టోరిస్‌తో ఇది పోటీ పడనుంది.



హ్యుందాయ్ బేయాన్ 4,245 ఎంఎం పొడవు, 1810 ఎంఎం వెడల్పు, 2600 ఎంఎం వీల్‌బేస్‌తో వస్తోంది. 205 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్ ఇచ్చారు. స్ప్లిట్ హెడ్‌ల్యాంప్, స్లిమ్ ఎల్ఈడీ డీఆర్ఎల్స్ ఉన్నాయి. పెటల్ స్టైల్ అల్లాయ్ వీల్స్ ఇచ్చారు. 505 లీటర్ల బూట్ స్పేస్ కల్పించారు.

ఇంటీరియర్ విషయానికొస్తే.. 12.3 అంగుళాలు కలిగిన రెండు డ్యాష్‌బోర్డులు ఇచ్చారు. ఒకటి ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, మరొకటి ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ కోసం కేటాయించారు. దేశంలోనే తొలిసారి జనరేటివ్ ఏఐ వాయిస్ అసిస్టెంట్ సదుపాయాన్ని ఇందులో అందిస్తున్నారు. 70 రకాల కనెక్టెడ్ ఫీచర్లు కలిగిన హ్యుందాయ్ బ్లూలింక్ సదుపాయం ఉంది.



ఇందులో 1.5 లీటర్ ఫోర్ సిలిండర్ నేచురల్ యాస్పిరేటెడ్ ఎంపీఐ పెట్రోల్ ఇంజిన్ ఇచ్చారు. ఇది 115 బీహెచ్‌పీ పవర్‌ను, 144 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సిక్స్ స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్, హ్యుందాయ్ ఇంటిలిజెంట్ వేరియబుల్ ట్రాన్స్‌మిషన్ (అఐు), జఐు ఆప్షన్లతో లభిస్తుంది. సీవీటీ వేరియంట్ లీటర్‌కు 18.6 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని తెలిపింది.

ఇందులో ఎకో, నార్మల్, స్పోర్ట్ డ్రైవ్ మోడ్స్ ఉన్నాయి. ఆరు ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హ్యుందాయ్ స్మార్ట్‌సెన్స్ లెవల్ 2 ప్రోూూూ ఫీచర్లు ఉన్నాయి. ఫార్వర్డ్ కొలిజన్ వార్నింగ్, బ్లైండ్ స్పాట్ కొలిజన్ వార్నింగ్, లేన్ కీపింగ్ అసిస్ట్, లేన్ డిపాచుర్ వార్నింగ్, డ్రైవింగ్ అటెన్షన్ వార్నింగ్ వంటి సదుపాయాలు ఉన్నాయి.

సిరీస్ ఆశలు నిలవాలంటే కివీస్ గెలవాల్సిందే..
హ్యాట్రిక్ విజయంపై భారత్ కన్ను!

సిరీస్ లో 0-2తో వెనుకబడిన కివీస్
హెన్రీ, ఫెర్గూసన్ దూరం.. ఆతిథ్య జట్టుకు ఎదురుదెబ్బ
హ్యాట్రిక్ విజయంపై టీమ్‌ఇండియా గురి
వెల్లింగ్టన్ గాలులు, చిన్న బౌండరీలతో కొత్త సవాలు
రెండో టీ20లో నాలుగు వికెట్లు తీసిన శాంట్నర్‌తో ప్రమాదం



న్యూజిలాండ్‌తో మూడో టీ20కి రంగం సిద్ధమైంది. వరుసగా రెండు విజయాలతో జోరుమీదున్న టీమిండియా మరో గెలుపుతో సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తోంది. మరోవైపు సొంతగడ్డపై ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లో ఓడిన న్యూజిలాండ్‌కు ఇది చావోరేవో పోరు. ఈ మ్యాచ్‌లోనూ ఓడితే సిరీస్ చేజారిపోతుంది. కీలకమైన ఈ పోరుకు ముందు కివీస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన పేసర్లు మాట్ హెన్రీ, లాకీ ఫెర్గూసన్ మూడో టీ20కి దూరమయ్యారు. దీంతో ఒత్తిడిలో ఉన్న ఆతిథ్య జట్టుకు సవాలు మరింత పెరిగింది. క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన రెండో టీ20లో మాట్ హెన్రీ కేవలం రెండు ఓవర్లే బౌలింగ్ చేశాడు. అందులో ఒకటి మెయిడిన్. కాలి కండరాల సమస్యతో ఇబ్బందిపడిన అతడిని మిగిలిన సిరీస్ నుంచి తప్పించారు. ఇతర ఫార్మాట్లకు సిద్ధమయ్యేందుకు అతడి పనిభారాన్ని తగ్గించాలని జట్టు నిర్ణయించింది. లాకీ ఫెర్గూసన్ కూడా రెండో మ్యాచ్‌లో పూర్తి కోటా ఓవర్లు వేయకుండానే మైదానం వీడాడు. ముందు జాగ్రత్త చర్యగా అతడికి మూడో మ్యాచ్‌లో విశ్రాంతి ఇవ్వనున్నారు. ఈ ఇద్దరు లేకపోవడంతో ఆడమ్ మిల్నే, బ్లెయిర్ టిక్నర్‌లపై కివీస్ ఆధారపడాల్సి ఉంటుంది. కైల్ జేమీసన్ కూడా వెల్లింగ్టన్ మ్యాచ్ ఆడిన తర్వాత టెస్టు సిరీస్‌కు సన్నద్ధమయ్యేందుకు ఫోర్డ్ ట్రోఫీలో పాల్గొననున్నాడు.

గెలుపు జోరులో భారత్..
భువీపై ప్రత్యేక దృష్టి

మరోవైపు టీమిండియా ఇప్పటివరకు అన్ని విభాగాల్లోనూ మెరుగైన ప్రదర్శన చేసింది. తొలి మ్యాచ్‌కు ముందు ఒక్కసారి మాత్రమే ప్రాక్టీస్ చేసినప్పటికీ, బ్యాటింగ్‌లో సత్తా చాటింది. తొలి టీ20లో 226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన భారత్.. రెండో మ్యాచ్‌లో 181 పరుగుల లక్ష్యాన్నీ అందుకుంది. అయితే న్యూజిలాండ్ ఫీల్డింగ్, బౌలింగ్‌లో చేసిన తప్పిదాలు కూడా భారత్ విజయాలకు కారణమయ్యాయి. భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ మాత్రం తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉంది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఎనిమిది ఓవర్లు వేసి 99 పరుగులు ఇచ్చిన అతడు ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. వెల్లింగ్టన్‌లోనైనా పుంజుకుంటాడని భారత జట్టు ఆశిస్తోంది.

గాలులు.. చిన్న బౌండరీలు కీలకం!

వెల్లింగ్టన్‌లోని హెచ్‌ఎన్ఆర్‌వై స్టేడియం పరిస్థితులు భారత్‌కు కొత్త సవాలు విసరనున్నాయి. 'కేక్ టిన్'గా పేరున్న ఈ మైదానంలో సాధారణంగా బలమైన గాలులు వీస్తుంటాయి. ఇక్కడి పిచ్ కూడా డ్రాప్-ఇన్ పిచ్. మైదానానికి ఇరువైపులా స్క్వేర్ బౌండరీలు సుమారు 60 మీటర్లే ఉండటంతో బ్యాటర్లు భారీ షాట్లతో విరుచుకుపడే అవకాశం ఉంది. ఈ పరిస్థితులకు తగ్గట్టుగా భారత బౌలర్లు తమ వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుంది. ఇక గాయం నుంచి పూర్తిగా కోలుకోని ఇషాన్ కిషన్ మూడో మ్యాచ్‌కూ అందుబాటులో ఉండడం లేదు. కుడి తొడ కండరానికి స్వల్ప గాయం కావడంతో అతడు ఇంకా కోలుకుంటున్నాడు. దీంతో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి మరోసారి మూడో స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం దక్కనుంది. గత మ్యాచ్‌లో ఆడిన జట్టుతోనే భారత్ బరిలోకి దిగే సూచనలు కనిపిస్తున్నాయి.

గణాంకాల్లోనూ భారత్‌దే పైచేయి

న్యూజిలాండ్‌తో టీ20ల్లో భారత్ రికార్డు మెరుగ్గా ఉంది. ఇరు జట్ల మధ్య జరిగిన 33 టీ20ల్లో భారత్ 21 గెలవగా, న్యూజిలాండ్ 11 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఒక మ్యాచ్ టైగా ముగిసింది. న్యూజిలాండ్ గడ్డపై ఆడిన 14 టీ20ల్లోనూ భారత్ తొమ్మిది విజయాలు సాధించింది. భారత బ్యాటర్ తిలక్ వర్మ ఛేజింగ్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. టీ20ల్లో లక్ష్య ఛేదన సమయంలో అతడి సగటు 51.6 కాగా, తొలుత బ్యాటింగ్ చేసినప్పుడు 39.7గా ఉంది. తిలక్ నాటౌట్‌గా నిలిచిన 12 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ భారత్ గెలిచింది. మొత్తం టీ20 క్రికెట్‌లో అతడు నాటౌట్‌గా ముగించిన 26 ఇన్నింగ్స్‌ల్లోనూ అతడి జట్టే విజయం సాధించడం విశేషం. 2025 నుంచి ఇప్పటివరకు 52 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 1,282 పరుగులు చేసిన తిలక్.. 41.4 సగటు, 141.7 స్ట్రైక్‌రేట్‌తో రాణించాడు. అయితే భారత బ్యాటర్లకు కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ నుంచి ముప్పు పొంచి ఉంది. రెండో టీ20లో అతడు నాలుగు వికెట్లు పడగొట్టాడు. 2025లో స్పిన్ బౌలింగ్‌లో భారత బ్యాటర్లు సగటున 58.2 పరుగులు చేయగా, 2026లో ఆ సగటు 27.3కు పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది స్పిన్నర్ల బౌలింగ్‌లో భారత్ వికెట్లు వేగంగా కోల్పోతోంది. ఈ బలహీనతను శాంట్నర్ మరోసారి ఉపయోగించుకోవాలని చూస్తున్నాడు. మొత్తానికి, భారత్ హ్యాట్రిక్ విజయంతో సిరీస్‌ను సొంతం చేసుకుంటుందా? లేక కివీస్ పుంజుకుని పోరును ఆసక్తికరంగా మారుస్తుందా? అనేది చూడాలి.

మ్యాచ్ వివరాలు
తేదీ: అక్టోబర్ 27, మంగళవారం
సమయం: మధ్యాహ్నం 12.30 గంటలకు
వేదిక: హెచ్‌ఎన్ఆర్‌వై స్టేడియం, వెల్లింగ్టన్
ప్రత్యక్ష ప్రసారం: సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్
లైవ్ స్ట్రీమింగ్: సోనీ లివ్ యాప్, వెబ్‌సైట్

స్పోర్ట్స్

ఒక్క పరుగు తేడాతో డబుల్ సెంచరీ మిస్..
న్యూజిలాండ్-ఏపై పడిక్కల్ దండయాత్ర

న్యూజిలాండ్-ఎతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో పడిక్కల్ వీరవిహారం
248 బంతుల్లో 24 ఫోర్లు, 3 సిక్సర్లతో 199 పరుగులు
అంపైర్ వివాదాస్పద నిర్ణయంతో డబుల్ సెంచరీ మిస్
సాయి సుదర్శన్, యష్ రాథోడ్‌లతో భారీ భాగస్వామ్యాలు
తొలి ఇన్నింగ్స్ వెనుకబాటు నుంచి ఇండియా-ఎ ఊహించని కంబ్యాక్



న్యూజిలాండ్-ఎ జట్టుతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టు మ్యాచ్‌లో భారత్-ఎ జట్టు అద్భుత పునరాగమనం (కంబ్యాక్) సాధించింది. భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (199) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో మ్యాచ్‌పై ఇండియా-ఎ పూర్తి ఆధిపత్యం సాధించింది. బెర్ట్ సట్‌క్లిఫ్ ఓవల్ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్ మూడో రోజు పోరులో పడిక్కల్ సుడిగాలి సెంచరీతో జట్టును సురక్షిత తీరానికి చేర్చాడు. పడిక్కల్ 248 బంతుల్లో 24 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 80.24 స్ట్రైక్ రేట్‌తో 199 పరుగులు సాధించాడు. అయితే టీ విరామానికి 10 నిమిషాల ముందు జాక్ గిబ్సన్ బౌలింగ్‌లో అంపైర్ ఇచ్చిన క్యాచ్ ఔట్ నిర్ణయంతో పడిక్కల్ తీవ్ర అసంతృప్తికి లోనయ్యాడు. బంతి బ్యాట్‌కు అసలు తగలలేదని సైగలు చేస్తూ, మైదానంలోనే అంపైర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ నిరాశగా వెనుతిరిగాడు. కేవలం ఒక్క పరుగు తేడాతో ద్విశతకం (డబుల్ సెంచరీ) చేజార్చుకున్నప్పటికీ, అతడు ఆడిన ఇన్నింగ్స్ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది.

ఘోర పతనం నుంచి అద్భుత కంబ్యాక్!

ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-ఎ కేవలం 113 పరుగులకే కుప్పకూలగా, న్యూజిలాండ్ 'ఎ' 317 పరుగులు చేసి 204 పరుగుల భారీ ఆధిపత్యాన్ని సాధించింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభంలోనూ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్‌లు 9 పరుగులకే పెవిలియన్ చేరడంతో భారత్ తీవ్ర కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన పడిక్కల్, సాయి సుదర్శన్ (91)తో కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 215 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆ తర్వాత యష్ రాథోడ్‌తో కలిసి మరో 142 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని జోడించాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-ఎ 6 వికెట్ల నష్టానికి 378 పరుగులు చేసి, 174 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

రేసులో పడిక్కల్.. టెస్టు బెర్త్ కోసం గట్టి పోటీ!

టెస్ట్ క్రికెట్‌లో పడిక్కల్ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. శ్రీలంక పర్యటనలో స్పిన్నర్లపై ధాటిగా ఆడిన అతడు, ఇప్పుడు న్యూజిలాండ్ వేగవంతమైన పిచ్‌లపై కూడా సత్తా చాటాడు. రాబోయే సీనియర్ టెస్ట్ జట్టులో మూడో స్థానం కోసం పోటీపడుతున్న సాయి సుదర్శన్, పడిక్కల్‌లు ఇద్దరూ ఈ మ్యాచ్‌లో రాణించడం విశేషం. నాలుగు రోజుల ఈ మ్యాచ్ ఆఖరి రోజున భారత్ విజయం సాధించే దిశగా అడుగులు వేస్తోంది.

మహానగర్



రవిబాబు హారర్ సినిమాలో కంగనా రనౌత్

వైవిధ్యమైన కథలు, విభిన్నమైన చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడు రవిబాబు మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'రేజర్'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన.. ఇప్పుడు హారర్ కథాంశంతో సినిమా తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించబోతున్నారనే వార్తలు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ముందస్తు పనులు పూర్తయ్యాయని, చిత్రీకరణ కూడా రహస్యంగా జరుగుతోందని కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. కంగనా నిజంగానే ఈ సినిమాలో నటిస్తున్నారా? ఒకవేళ నటిస్తే ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.కంగనా రనౌత్ వంటి బాలీవుడ్ స్టార్.. రవిబాబు దర్శకత్వంలో హారర్ సినిమాలో నటించబోతున్నారనే ప్రచారం నిజమైతే ఈ ప్రాజెక్టుపై అంచనాలు పెరిగే అవకాశం ఉంది. కంగనా రనౌత్ గతంలో ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'ఏక్ నిరంజన్' సినిమాలో హీరోయిన్‌గా కనిపించారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ద్వారా ఆమె తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అదే ఆమె నటించిన ఏకైక తెలుగు చిత్రంగా ఇప్పటివరకు గుర్తింపు పొందింది. ఇప్పుడు రవిబాబు దర్శకత్వంలో హారర్ సినిమా చేస్తున్నారనే ప్రచారం నిజమైతే.. దాదాపు 17 ఏళ్ల తర్వాత ఆమె మరోసారి తెలుగు సినిమాలో కనిపించే అవకాశం ఉంటుంది. దీంతో ఈ వార్తపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.మరోవైపు కంగనా రనౌత్ ప్రస్తుతం పలు చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'క్వీన్ 2', 'సర్కిల్', 'తను వెడ్స్ మను 3' వంటి ప్రాజెక్టులకు సంబంధించి వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె తెలుగు సినిమా చేయబోతున్నారనే ప్రచారం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.అయితే రవిబాబు దర్శకత్వంలో తెరకెక్కనున్నట్లు చెబుతున్న హారర్ సినిమాలో కంగనా నటిస్తున్నారా? చిత్రీకరణ నిజంగానే ప్రారంభమైందా? అనే అంశాలపై ఆమె బృందం లేదా చిత్రబృందం నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. అప్పటివరకు ఈ క్రేజీ కాంబినేషన్‌పై వస్తున్న వార్తలను ప్రచారంగానే పరిగణించాలి.

ప్రభాస్ ఫౌజీకి చిక్కులు.. నేతాజీ చరిత్రను వక్రీకరించారంటూ దర్శకుడిపై విమర్శలు!



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ఫౌజీ' చుట్టూ వివాదం మొదలైనట్లు వార్తలు వస్తున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చరిత్రకు సంబంధించిన అంశాలను సినిమాలో వక్రీకరించారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ విషయంపై నేతాజీ మనవడు, ఆయన కుటుంబానికి చెందిన చంద్రకుమార్ బోస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. చరిత్రను తప్పుగా చూపించినందుకు చిత్ర దర్శకుడు భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితానికి సంబంధించిన అంశాలను చిత్రాల్లో చూపించే విషయంలో దర్శకులు జాగ్రత్తగా వ్యవహరించాలని చంద్రకుమార్ బోస్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా నేతాజీ, జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్‌తో సమావేశమైన సందర్భాన్ని సినిమాలో తప్పుగా చిత్రీకరించారనే ఆరోపణలు ఆయన చేశారు. స్వాతంత్ర్య పోరాటం, దానికి నాయకత్వం వహించిన ప్రముఖుల గురించి సినిమాలు తీయడానికి చిత్రనిర్మాతలకు స్వేచ్ఛ ఉంది కాని, సృజనాత్మక స్వేచ్ఛ పేరుతో చారిత్రక వాస్తవాలను వక్రీకరించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ నాయకుల గురించి సినిమాలు తీసేటప్పుడు వాస్తవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రకుమార్ బోస్ వ్యాఖ్యానించారు. చారిత్రక అంశాలను తప్పుగా చూపిస్తూ కల్పిత కథనాలను జోడించడం నేరంతో సమానమని ఆయన అభిప్రాయపడ్డారు. నేతాజీ హిట్లర్‌తో జరిపిన భేటీకి సంబంధించిన అంశాలను వక్రీకరించడం ద్వారా స్వాతంత్ర్య సమరయోధుడి స్థాయిని తగ్గించినట్లుగా సినిమా ఉందని ఆయన ఆరోపించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 'ఫౌజీ' దర్శకుడు భారత ప్రజలకు, దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని గౌరవించే వారందరికీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు. ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ'పై వచ్చిన ఈ ఆరోపణలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే చంద్రకుమార్ బోస్ చేసిన ఆరోపణలకు సంబంధించి చిత్రబృందం అధికారికంగా స్పందిస్తుందా, సినిమాలో నేతాజీకి సంబంధించిన సన్నివేశాలను ఏ విధంగా చిత్రీకరించారు? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వివాదానికి సంబంధించి ఆరోపణలు మాత్రమే వెలుగులోకి వచ్చాయి. చిత్రబృందం వివరణ లేదా సినిమాలోని సంబంధిత సన్నివేశాలపై పూర్తి సమాచారం అందుబాటులోకి వచ్చిన తర్వాతే ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

వరుస పాన్ ఇండియా సినిమాలతో గోపీచంద్ కమ్‌బ్యాక్



టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ వరుస పరాజయాల నుంచి బయటపడి సాలిడ్ కమ్‌బ్యాక్ ఇవ్వాలని పట్టుదలతో ఉన్నారు. గతంలో తనకు విజయాలు అందించిన తరహా కథలకే పరిమితం కాకుండా, కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో రెండు ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ సినిమాలతోనైనా బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటాలని గోపీచంద్ ప్రయత్నిస్తున్నారు. గోపీచంద్ నటిస్తున్న చిత్రాల్లో 'భరతవర్ష' ఒకటి. సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి సారించింది. ఇటీవల విడుదల చేసిన 'అమ్మ కదిలి వచ్చే' పాటతో సినిమా సంగీత ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాపై గోపీచంద్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. గత చిత్రాలకు భిన్నంగా ఈ సినిమా ఆయన కెరీర్‌కు ఎలాంటి మలుపు తీసుకొస్తుందోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు గోపీచంద్ 'సింగా' అనే పాన్ ఇండియా చిత్రంలోనూ నటిస్తున్నారు. ఈ సినిమాతో స్టంట్ కొరియోగ్రాఫర్ వెంకట్ మాస్టర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే సగానికిపైగా పూర్తయినట్లు తెలుస్తోంది.ఈ సినిమాకు సామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్ గోపీచంద్ పాత్రపై ఆసక్తిని పెంచింది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ఆయన కెరీర్‌లో మరో కీలక ప్రాజెక్టుగా నిలవనుంది. ప్రస్తుతం 'భరతవర్ష', 'సింగా' చిత్రాలతో బిజీగా ఉన్న గోపీచంద్.. విడుదల తేదీల విషయంలో మాత్రం తొందరపడటం లేదని తెలుస్తోంది. ఒక సినిమా షూటింగ్ పూర్తవగా, మరో సినిమా సగానికిపైగా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అయినప్పటికీ ఇప్పటివరకు ఈ రెండు సినిమాల విడుదల తేదీలను ప్రకటించలేదు. చిత్రీకరణ, నిర్మాణానంతర పనులు, ఇతర ఏర్పాట్లు పూర్తిగా సిద్ధమైన తర్వాతే విడుదల తేదీని ప్రకటించాలని చిత్ర బృందాలు భావిస్తున్నట్లు సమాచారం. ముందుగానే తేదీ ప్రకటించి, చివరి నిమిషంలో వాయిదా వేయాల్సిన పరిస్థితి రాకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. గోపీచంద్ గత కొంతకాలంగా ఆశించిన విజయాలను అందుకోలేకపోతున్నారు. దీంతో ఈసారి కథల ఎంపికలో కొత్తదనానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది.

జైలర్ 2 బాక్సాఫీస్ సునామీ



సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారని ట్రేడ్ వర్గాల గణాంకాలు చెబుతున్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. విడుదలైన మొదటి వారంలోనే మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. రెండో వారాంతంలోనూ అదే జోరును కొనసాగించినట్లు సమాచారం. ట్రేడ్ అంచనాల ప్రకారం, కేవలం 11 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.700 కోట్ల గ్రాస్ వసూళ్ల మార్కును దాటింది. దీంతో రజనీకాంత్ అభిమానుల్లో ఈ సినిమాపై ఉత్సాహం మరింత పెరిగింది. సాధారణంగా భారీ అంచనాలతో విడుదలైన సినిమాలకు తొలి వారాంతంలో మంచి వసూళ్లు వచ్చినప్పటికీ, ఆ తర్వాత కలెక్షన్లు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది. అయితే 'జైలర్ 2' విషయంలో రెండో వారాంతంలోనూ వసూళ్ల జోరు కొనసాగినట్లు ట్రేడ్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా రెండో ఆదివారం సినిమా కలెక్షన్లు పెరిగినట్లు సమాచారం. ఆ ఒక్క రోజే దేశవ్యాప్తంగా సుమారు రూ.25.70 కోట్ల నికర వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ గణాంకాలు పేర్కొంటున్నాయి. రెండో వారాంతంలోని మూడు రోజుల్లో కలిపి దాదాపు రూ.64.35 కోట్ల నెట్ వసూళ్లు వచ్చినట్లు అంచనా. ట్రేడ్ వర్గాల గణాంకాల ప్రకారం, 'జైలర్ 2' ప్రపంచవ్యాప్త గ్రాస్ వసూళ్లు రూ.710.35 కోట్లకు చేరినట్లు సమాచారం. ఇందులో దేశీయ మార్కెట్ నుంచి సుమారు రూ.466.85 కోట్లు, విదేశీ మార్కెట్ల నుంచి దాదాపు రూ.243.50 కోట్ల గ్రాస్ వచ్చినట్లు అంచనాలు చెబుతున్నాయి. ఇక దేశవ్యాప్తంగా నికర వసూళ్లు సుమారు రూ.398.70 కోట్లకు చేరినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇదే జోరు కొనసాగితే త్వరలోనే రూ.400 కోట్ల నెట్ మార్కును కూడా అందుకునే అవకాశం ఉంది. అయితే ఇవి ట్రేడ్ అంచనాల ఆధారంగా వచ్చిన గణాంకాలు కావడంతో, అధికారిక వసూళ్ల వివరాలతో పోల్చి చూడాల్సి ఉంటుంది.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999